ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
సోమవారం 2 సెప్టెంబరు 2024

తంబళ్లపల్లెలో టెన్షన్..టెన్షన్..

- పెద్దిరెడ్డి కుటుంబం వస్తుండటంతో ఉద్రిక్తత
- అడ్డుకునేందుకు భారీగా అంగళ్లుకు చేరుకున్న టీడీపీ శ్రేణులు
- అంగళ్లు నుంచి తంబళ్లపల్లెకు వెళుతున్న టీడీపీ నేతను అడ్డుకున్న పోలీసులు
- ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి దిష్టిబొమ్మ దహనం


కురబలకోట మండలం అంగళ్లులో భారీ సంఖ్యలో ఉన్న టీడీపీ శ్రేణులు

ములకలచెరువు/కురబలకోట/తంబళ్లపల్లె, సెప్టెంబరు 1: తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఆదివారం హై టెన్షన్ నెలకొంది. పెద్దతిప్పసముద్రం మండలం మద్దయ్యగారిపల్లెలో జరుగుతున్న ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠకు ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి వస్తున్నారని సమాచారం రావడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితు లు నెలకొన్నాయి. తంబళ్లపల్లె నియోజకవర్గంలో అరాచకా లు, దౌర్జన్యాలకు, దాడులకు పాల్పడి, భూకబ్జాలు చేసి భూ ములు లాక్కున్న పెద్దిరెడ్డి కుటుంబానికి తంబళ్లపల్లె ని యోజకవర్గానికి వచ్చే అర్హత లేదని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డితో పాటు భారీ సంఖ్యలో టీడీపీ శ్రేణులు వారిని అడ్డుకునేందుకు కురబలకోట మండలం అంగళ్లుకు చేరుకున్నారు. దీంతో అంగళ్లలో హైటెన్షన్ నెలకొంది. అలాగే టీడీపీ శ్రేణులు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. పెద్దిరెడ్డి కుటుంబానికి నియోజకవర్గంలో అడుగుపెట్టే అర్హత లేదని నినాదాలు చేశారు. కాగా పీటీఎం మండలం మద్దయ్యగారిపల్లెలో విగ్రహ ప్రతి ష్ఠ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి తంబళ్లపల్లెలోని ఆయన ఇంటికి శనివారం సాయంత్రమే చేరుకున్నారు. అలాగే ఆరు మండలాల నుంచి వైసీ పీ ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధులు కూడా పెద్ద సం ఖ్యలో ఎమ్మెల్యే స్వగృహం వద్దకు చేరుకున్నారు. ఎమ్మెల్యే విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి అనుచరవర్గంతో వెళ్తున్నారని సమాచారం రావడంతో భారీగా పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ములకలచెరువు, మదనపల్లె సీఐలు రాజారమేష్, వెంకట్రావు, ములకలచెరువు, తంబళ్లపల్లె ఎస్‌ఐలు గాయత్రి, లోకేష్‌రెడ్డిలు తమ సిబ్బందితో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి పీటీఎం మండలానికి వెళ్లకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. శాంతిభద్రతల దృ ష్ట్యా ఎక్కడికీ వెళ్లకూడదని ఎమ్మెల్యేకు తెలియజేశారు. కా గా ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి పీటీఎం మండలంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠకు వెళుతున్నారని సమాచారం రావడంతో అంగళ్లలో ఉన్న తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డితో పాటు టీడీపీ శ్రేణులందరూ తంబళ్లపల్లెకు వెళ్లేందుకు వాహనాల్లో బయలుదేరుతుండగా అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకున్నారు. టీడీపీ శ్రేణుల వాహనాలకు పోలీసు జీపు అడ్డుపెట్టారు. దీంతో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో తంబళ్లపల్లెకు చేరుకున్న మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు, సీఐ రాజరమేష్ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి శాంతిభద్రతల దృష్ట్యా ఇక్కడి నుంచి వెళ్లాలని సూచించారు. దీంతో ఎమ్మెల్యే మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో తంబళ్లపల్లె నుంచి బయలుదేరి కుక్కరాజుపల్లె, గుర్రంకొండ, వాల్మీకిపురం మీదుగా తిరుపతికి వెళ్లడంతో టీడీపీ శ్రేణులు శాంతించారు.

మద్దయ్యగారిపల్లెలో 144 సెక్షన్ విధింపు

పెద్దతిప్పసముద్రం మండలం మద్దయ్యగారిపల్లెలో 144 సెక్షన్ విధించారు. గ్రామంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిధున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి వస్తున్నారని సమాచారం రావడంతో గొడవలు జరిగే అవకాశం ఉన్నందున 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఆలయాన్ని ఆర్‌అండ్‌బీ స్థలంలో నిర్మించారని అధికారులు తెలియజేశారు.

బ్రిటీషు దొరల మాదిరిగా ప్రజలను హింసించారు

- టీడీపీ నేత జయచంద్రారెడ్డి

తంబళ్లపల్లె నియోజకవర్గంలో అరాచకాలకు పాల్పడ్డ పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఇక్కడికి రానివ్వమని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి తెలిపారు. అంగళ్లలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో పెద్దిరెడ్డి కుటుంబం నియోజకవర్గాన్ని దోచుకుని అరాచకాలకు, దౌర్జన్యాలకు పాల్పడిందన్నారు. బ్రిటీషు దొరల మాదిరిగా ప్రజలను హింసించిన పెద్దిరెడ్డి కుటుంబం నియోజకవర్గానికి వచ్చే అర్హత లేదన్నారు. అరాచక పాలకులకు నియోజకవర్గంలో స్థానం లేదన్నారు. నియోజకవర్గానికి పెద్దిరెడ్డి కుటుంబం ఎప్పుడు రావాలని చూసినా శాంతియుతంగా నిరసన తెలిపి అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో నియోజవర్గ సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, మండల అధ్యక్షుడు వైజీ సురేంద్రయాదవ్, బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, జిల్లా కార్యదర్శి ఎర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, నేతలు శ్రీనాథరెడ్డి, తులసీధర్ నాయుడు, నరసింహారెడ్డి, మాజీ ఎంపీపీ తిమ్మరాయుడు, ఆయూబ్‌బాషా, శ్రీనివాసులు, ఆనంద్, చంద్ర అశోక్, బొగ్గు భాస్కర్ తదితరులతో పాటు ఆరు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


టీడీపీ శ్రేణులతో ఉన్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి


తంబళ్లపల్లెకు వెళ్లకుండా టీడీపీ శ్రేణుల వాహనాలను అడ్డుకున్న పోలీసులు

భాగస్వామ్య పెన్షన్ వద్దు..

- పాత పెన్షన్ కావాలి : ఎస్టీయూ డిమాండ్

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 1: భాగస్వామ్య పెన్షన్ తీసేసి పాత పెన్షన్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎస్టీయూ డిమాండ్ చేసింది. ఆదివారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆ సంఘం నాయకులు నిరసన తెలియచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగ ఉపాధ్యాయులకు సెప్టెంబరు ఒకటో తేదీ చీకటి రోజన్నారు. కార్యక్రమంలో శివారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు తీసుకొచ్చిన సీపీఎస్, జీపీఎస్ లాంటి విధానాలు మాకొద్దు అని కూటమి ప్రభుత్వానికి తెలియచేస్తున్నామన్నారు. ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శంకర్‌రెడ్డి, మహబూబ్‌ఖాన్, నాగరాజ, మురళి, సుబ్బారెడ్డి, గణేష్, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియచేస్తున్న ఎస్టీయూ నాయకులు

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

- విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలి
- టీడీపీ ప్రభుత్వంలో క్రీడలకు అధిక ప్రాధాన్యం
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


మహిళల విభాగంలో గెలిచిన తమిళనాడు జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్, సెప్టెంబరు 1: క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుడ్యానికి దోహదపడతాయని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో 2వ సౌత్‌జోన్ టార్గెట్ బాల్ చాంపియన్‌షిప్ 2024-25 పురుషులు, మహిళల విభాగంలో జరిగిన పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొని గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించి జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ప్రతి ఓటమి మరో గెలుపునకు నాంది పలుకుతుందని, పోటీల్లో ఓడినవారు నిరుత్సాహం చెందకుండా రాబోయే ఆటల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. విద్య అనేది మనిషికి జ్ఞానాన్ని ఇచ్చి ఎలా మెరుగుపరుస్తుందో అదే విధంగా క్రీడలు కూడా మన జీవితానికి ఎన్నో పాఠాలు నేర్పిస్తాయన్నారు. విద్యతో పాటు క్రీడలు కూడా మనలో భాగస్వామ్యం అయినప్పుడు పరిపూర్ణత గల మనిషిగా అభివృద్ధి చెందుతారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం క్రీడలతో పాటు విద్య, ఉద్యోగాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. రాయచోటి పట్టణంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న టార్గెట్ బాల్ క్రీడా పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పాండిచ్చేరి, తెలంగాణ, కర్నాటక, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరై స్నేహపూరిత వాతావరణంలో ఈ క్రీడలు విజయవంతంగా జరపడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని వ్యాయామ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆరు రాష్ట్రాల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే...

సీనియర్ మహిళల టార్గెట్ బాల్ విభాగంలో తమిళనాడు జట్టు, పురుషుల టార్గెట్ బాల్ సౌత్‌జోన్ పోటీల విభాగంలో పుదుచ్చేరి జట్టు విజేతలుగా నిలిచినట్లు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్ తెలిపారు. పురుషుల విభాగంలో ఆంధ్రప్రదేశ్ ద్వితీయ స్థానం, తెలంగాణ మూడవ స్థానం సాధించగా మహిళల విభాగంలో కర్నాటక ద్వితీయ స్థానం, పుదుచ్చేరి మూడవ స్థానం సాధించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, పీడీలు రెడ్డెయ్య, నరసరాజు, ఆంజనేయులు, వరదరాజు, లక్ష్మినారాయణ, ఆనంద్, రామాంజనేయులు, కరుణాకర్, గోపాల్, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

హిటాచీతో పాలికొండను తవ్వుతూ ఆ మట్టిని టిప్పర్‌లో వేస్తున్న దృశ్యం



ఇసుక రీచ్ రోడ్డు కోసం మట్టిని తోడేయడంతో బోడిగా మారిపోయిన పాలికొండ



పాలికొండను పిండేశారు..

- కొండను తొలిచి చెయ్యేరులో రోడ్డేశారు..
- కొండ నుంచి అక్రమంగా మట్టి తరలింపు
- ఫిర్యాదు చేస్తే దురుసుగా ప్రవర్తించిన డీఎఫ్‌వో
- డిప్యూటీ సీఎం పవన్‌కు అతికారి దినేశ్ ఫిర్యాదు
- తక్షణం విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం ఆదేశం
- స్పెషల్ స్క్వాడ్ డీఎఫ్‌వో శివకుమార్ ఆధ్వర్యంలో విచారణ

రాజంపేట, సెప్టెంబరు 1: వైసీపీ నేతల ధనదాహానికి పాలికొండ బోడుగుండుగా మారింది. చెయ్యేరులో అక్రమంగా ఇసుక తవ్వకాలకు పాలికొండను తవ్వేసి నదిలోనే ఆ మట్టితో రోడ్డు వేయడంతో పాటు పాలికొండలోని గ్రావెల్‌ను పెద్ద పెద్ద హిటాచీలతో తవ్వేసి టిప్పర్ల ద్వారా తరలించి కోట్లాది రూపాయలకు పడగలెత్తారు కొందరు వైసీపీ నాయకులు. ఈ కొండను తొలిచేసి వైసీపీ నాయకులు అక్రమాలకు పాల్పడ్డారని, వారికి డీఎఫ్‌వో వివేక్‌తో పాటు ఇతర అధికారులు సహకరించారని జనసేన నాయకుడు అతికారి దినేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం పాలికొండలను అక్రమంగా తవ్విన వైసీపీ నాయకులు, వారికి సహకరించిన అటవీ అధికారులపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. డిప్యూటీ సీఎం ఆదేశాలతో ఆదివారం స్పెషల్ స్క్వాడ్ డీఎఫ్‌వో శివకుమార్ నేతృత్వంలో ఫిర్యాదుదారుడు, అతికారి దినేశ్‌తో కలిసి పాలికొండ ప్రాంతంలో విచారణ చేపట్టారు. కొండను తవ్విన అంశాన్ని పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణకు ముప్పు కలిగే రీతిలో కొండపై ఉన్న చెట్లను తొలగించి జేసీబీలు, హిటాచీల ద్వారా కొండను తవ్వి ఆ మట్టిని ఇసుక రీచ్ రోడ్డు కోసం చెయ్యేరులో వేసిన అంశాన్ని వారు పరిశీలించారు. రాజంపేట-రాయచోటి ప్రధాన రహదారికి సమీపంలో వీరబల్లె మండల పరిధిలోకి వచ్చే చెయ్యేరు ఆనుకుని పాలికొండ ఉంది. ఈ కొండకు సమీపంలో గత వైసీపీ నాయకులు ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకోసం ఎటువంటి అనుమతులు లేకుండా హిటాచీలు, జేసీబీలు ఏర్పాటు చేసి ప్రత్యేక డంపర్లు, టిప్పర్ల ద్వారా ఆ కొండ మట్టిని ఇసుక రీచ్‌ల రోడ్డుతో పాటు మట్టిని అక్రమంగా అక్కడి నుంచి తరలించారు. రాయచోటి-రాజంపేట కొండ మార్గంలో ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో పచ్చనిచెట్ల మధ్య ఈ కొండలు ఉన్నాయి. ఈ కొండలను తవ్వడానికి ఎటువంటి అనుమతులు తీసుకోలేదు. కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధికారులు అనుమతులు ఇస్తే తప్ప ఇక్కడ ఒక చిన్నపాటి చెట్టును కూడా తొలగించడానికి వీలులేదు. సరికదా పెద్దఎత్తున వాహనాలను ఏర్పాటు చేసి కొండను తవ్వడం చట్టరీత్యా పెద్ద నేరం. రాయచోటి-రాజంపేట రోడ్డులో అందరికీ కనుచూపు మేర కనిపించే ఈ కొండలో తవ్వకాలు చేస్తున్నా ఏ అధికారి కూడా పట్టించుకోలేదు. ఈ విషయమై గత ఏడాది డిసెంబరు 26న అతికారి దినేశ్, అన్నమయ్య జిల్లా డీఎఫ్‌వో వివేక్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే ఈ కొండ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని ప్రకృతి సంపదను కొల్లగొడుతుంటే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమని డీఎఫ్‌వోకు తెలిపారు. ఈ కొండ తవ్వకాలపై ఫిర్యాదు చేయడానికి మీరెవరని పేర్కొంటూ తనపై డీఎఫ్‌వో దురుసుగా ప్రవర్తించారని ఆరోపిస్తూ ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేశారు. అయినా అప్పట్లో ఎవరూ దీని గురించి పట్టించుకోలేదు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ రాజంపేటకు వచ్చినప్పుడు జరిగిన సంఘటనపై ఫొటోలతో సహా ఆయనకు చూపించి పాలికొండలో వైసీపీ అక్రమ తవ్వకాలను, మట్టిని ఇసుక రీచ్‌లకు వాడుకోవడాన్ని, ఈ విషయంలో అటవీశాఖ అధికారులు తోడ్పడిన అంశాన్ని, డీఎఫ్‌వో దురుసుగా ప్రవర్తించిన అంశాన్ని లిఖితపూర్వకంగా ఇచ్చారు. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపాలని, ఈ మట్టి అక్రమ తవ్వకాలకు పాల్పడింది ఎవరు, ఇందుకు తోడ్పడిన అటవీశాఖ అధికారులు ఎవరు, సమగ్ర నివేదిక అందించాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఆదివారం స్పెషల్ స్క్వాడ్ డీఎఫ్‌వో శివకుమార్ నేతృత్వంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా తవ్విన పాలికొండను పరిశీలించారు. దినేశ్ కూడా అధికారులతో పాటు పాలికొండకు వెళ్లి డీఎఫ్‌వో వివేక్‌పై ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై తాము ఫిర్యాదు చేస్తే తమ పట్ల డీఎఫ్‌వో దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. ఈ ప్రాంతంలో తొలగించిన చెట్లను, తవ్విన మట్టిని, తవ్వకాలకు వాడిన హిటాచి, డంపర్లను ఫొటోలతో విచారణ అధికారులకు చూపించారు. తవ్విన కొండ ఏ పరిధిలోకి వస్తుందో రిజర్వు ఫారెస్టుకు వస్తుందా లేదా అన్న అంశంపై మ్యాప్‌ల ద్వారా పరిశీలించారు. వెంటనే దీనిపై పూర్తి విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందచేస్తామని స్పెషల్ స్క్వాడ్ డీఎఫ్‌వో శివకుమార్ వెల్లడించారు.


పాలికొండల్లో విచారణకు శ్రీకారం చుట్టిన స్పెషల్ స్క్వాడ్ డీఎఫ్‌వో శివకుమార్, ఫిర్యాదుదారు అతికారి దినేశ్

మదనపల్లె కేంద్రంగా పనిచేస్తున్న పీకేఎం ఉడా కార్యాలయం



మూడు 'ఉడా' వైస్ చైర్మన్‌ల బదిలీ

- వైస్ చైర్మన్‌లుగా ఐఏఎస్‌ల నియామకం..?
- అక్రమ లేఅవుట్‌ల భరతం పట్టేందుకు మంత్రి నారాయణ అడుగులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 1: రాష్ట్రంలో 13 అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల వైస్ చైర్మన్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. గత ప్రభుత్వ పోకడలతో నియమితులైన నాన్ ఐఏఎస్ అధికారులను వారి మాతృసంస్థలకు పంపడమే కాక, 13 అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు వైస్‌చైర్మన్‌లుగా ఐఏఎస్ అధికారులను నియమించేందుకు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో అక్రమంగా వెలసిన లేఅవుట్‌ల భరతం పట్టేందుకు, ప్రభుత్వ ఆదాయం గణనీయంగా పెంచేందుకు ఐఏఎస్‌లను నియమించనున్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో మూడు ఉడాలు.. పుట్టగొడుగుల్లా అక్రమ లేఅవుట్లు

అన్నమయ్య జిల్లా పరిధిలోని 30 మండలాలు మూడు ఉడాల పరిధిలోకి వస్తాయి. వీటిలో రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని 14 మండలాలు కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కిందకు వస్తుండగా, పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాలు, మదనపల్లె మండలంలోని నిమ్మనపల్లె మండలం చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి వస్తాయి. మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని 8 మండలాలు, రెండు మున్సిపాలిటీలు పీకేఎం ఉడా పరిధిలో ఉన్నాయి. గతంలో వైసీపీ పాలనలో మంత్రుల ప్రధాన అనుచరులకు చుడా, పీకేఎం ఉడా, కడప ఉడా చైర్మన్ల పదవులు నామినేటెడ్ పద్ధతిలో ఇచ్చారు. దీంతో చోటామోటా రియల్టర్లు అందరూ వీరిని ఆశ్రయించి ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి అక్రమ లేఅవుట్లను వేసి ప్లాట్లను విక్రయించేశారు. 2021 వరకు లేఅవుట్ల కోసం కన్వర్షన్, కమ్యూనిటీ ఉపయోగాలకు 10 శాతం స్థలం, బెటర్‌మెంట్ చార్జీలు చెల్లించి సక్రమంగానే లేఅవుట్లు వేసేవారు. అనంతరం ఉడాలకు వైసీపీ నాయకులను చైర్మన్లుగా నియమించడంతో అడ్డూ అదుపులేకుండా అక్రమ లేఅవుట్లు పెద్దఎత్తున వెలిశాయి. రాయచోటి కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఏర్పడటం, అందులో మదనపల్లె, బి.కొత్తకోట, అంగళ్లు వంటి రియల్‌ఎస్టేట్ వ్యాపార ప్రాంతాలు ఉండటంతో అడ్డదిడ్డంగా వెలసిన లేఅవుట్లను ఎలాంటి అనుమతులు లేకుండా వేసేసి, ప్లాట్లను విక్రయించేశారు. దీంతో జిల్లాలో ప్రభుత్వం మూడేళ్లలో రూ.కోట్లలో ఆదాయం కోల్పోయింది. ఈ క్రమంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడం, మున్సిపల్ శాఖ మంత్రిగా పొంగూరు నారాయణ బాధ్యతలు తీసుకోవడంతో కొత్త సంస్కరణలను తీసుకొస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 13 ఉడాల వైస్ చైర్మన్‌లను బదిలీ చేస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లాలో ముగ్గురు ఉడాల వీసీలు బదిలీలు

అన్నమయ్య జిల్లాలోని 30 మండలాలు కడప, చిత్తూరు, పీకేఎం (పలమనేరు-కుప్పం-మదనపల్లె) ఉడాల పరిధిలోకి వస్తాయి. వీటికి గతంలో చైర్మన్‌లుగా పనిచేసిన ముగ్గురు రాష్ట్రంలో వైసీపీ ఓటమితో రాజీనామా చేసేశారు. దీంతో రెండున్నర నెలలుగా మూడు ఉడాలకు వైస్ చైర్మన్‌లుగా పనిచేస్తున్న ముగ్గురు అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. కడప ఉడా వీసీగా పనిచేస్తున్న వైవీ నందన్‌ను డీఎంఏలో రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వులు వెలువడ్డాయి. అలాగే చిత్తూరు ఉడా వీసీగా పనిచేస్తున్న పి.విశ్వనాథ్‌ను బదిలీ చేయడంతో తదుపరి పోస్టింగ్ ఎక్కడో వచ్చే ఉత్తర్వుల్లో తెలుపుతామని ఇచ్చారు. అలాగే పీకేఎం ఉడా వీసీగా పనిచేస్తున్న బాబర్‌ను ఆయన మాతృశాఖ అయిన ఏపీపీఎస్‌సీలో సెక్రటరీగా బదిలీ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం పెంచే దిశగా మంత్రి అడుగులు

అక్రమ లేఅవుట్‌లతో భారీగా ప్రభుత్వ ఖజానాకు గండి పడుతుండటంతో మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ వీటిపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఏకంగా 13 ఉడాల వీసీలను బదిలీ చేసేశారు. కాగా వీరి స్థానాల్లో ఐఏఎస్ అధికారులను నియమించవచ్చనే ప్రచారం జరుగుతోంది. జిల్లాలోని మూడు ఉడాల వీసీలుగా పనిచేసిన అధికారులు నాన్ ఐఏఎస్‌లు కావడంతో అప్పట్లో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యేలు, రాష్ట్ర నాయకులకు తలొగ్గి పనిచేయాల్సి వచ్చింది. దీంతో జిల్లాలో వైసీపీ హయాంలో వెలసిన అక్రమ లేఅవుట్ల సంగతి దేవుడెరుగు, రెండున్నర నెలల్లో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలిసాయి. వీటిని పరిశీలించేందుకు సంబంధిత అధికారులు వెళితే ఎక్కడెక్కడ నుంచో ఒత్తిడి తెస్తూ ఫోన్లు వస్తున్నట్లు ఆరోపణలు వున్నాయి. ఈ క్రమంలో మూడు ఉడాలకు వీసీలుగా ఐఏఎస్ అధికారులను నియమిస్తే రాజకీయ ఒత్తిడి తగ్గుతుందని భావిస్తున్నారు. అదే జరిగితే అక్రమ లేఅవుట్‌ల భరతం పట్టేందుకు ఐఏఎస్‌లు కంకణం కట్టుకుని పనిచేస్తారనేది సత్యం.

ఎలుగుబంటి దాడి

- వ్యక్తికి తీవ్రగాయాలు, ఆసుపత్రికి తరలింపు

పుల్లంపేట, సెప్టెంబరు 1: మండల పరిధిలోని వత్తలూరు పంచాయతీ తుమ్మలబైలు అటవీ ప్రాంతం వద్ద అటవీశాఖ బంగ్లా సమీపంలో వ్యక్తిపై ఆదివారం ఎలుగుబంటి దాడి చేయడంతో పుల్లారెడ్డిపల్లెకు చెందిన ఈశ్వరయ్య తీవ్రంగా గాయపడ్డాడు. అటవీశాఖ రాజంపేట డీఆర్వో నరసింహులు తెలిపిన వివరాల ప్రకారం... వత్తలూరు నుంచి తుమ్మలబైలు అటవీశాఖ బంగ్లా.. అక్కడి నుంచి రాయచోటి రోడ్డులోని ఎస్‌ఆర్ పాలెం వరకు రోడ్డు పనులు అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. పుల్లంపేట మండలం వత్తలూరు పంచాయతీ పుల్లారెడ్డిపల్లెకు చెందిన కూలీలు వారం రోజులుగా రోడ్డు పనులు చేస్తున్నారు. ఆదివారం ఉదయం సుమారు 15 మంది కూలీలు రోడ్డు పనికి వెళ్లారు. మధ్యాహ్న సమయంలో అటవీశాఖ బంగ్లా వద్ద ఉన్న మల్లాలమ్మకుంట వద్దకు భోజనం చేసేందుకు వెళ్లారు. ఆ సమయంలో ఈశ్వరయ్య అనే వ్యక్తి బహిర్భూమికి పక్కనే ఉన్న పొదల్లోకి వెళ్లాడు. అప్పటికే అక్కడ పిల్లలతో ఉన్న ఎలుగుబంటి అతడిపై దాడి చేసింది. ఈ దాడిలో ఈశ్వరయ్య మెడ, తల, చెవి భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. బిగ్గరగా కేకలు వేయడంతో మిగతా కూలీలు అక్కడికి చేరుకోవడంతో ఎలుగుబంటి వెళ్లిపోయింది. గాయపడ్డ ఈశ్వరయ్యను రాజంపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో చికిత్స చేయిస్తున్నామని డీఆర్వో తెలిపారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

రాయచోటి (కలెక్టరేట్), సెప్టెంబరు 1: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు, జూనియర్ కళాశాలలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారీ వర్షాలు పడవచ్చని వాతావరణ శాఖ నుంచి హెచ్చరికలు వచ్చిన నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా విద్యాసంస్థలకు సెలవు ఇచ్చామన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజల సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్లు, మండలాల ప్రజలు వారి సమస్యలను తెలియజేసేందుకు కలెక్టరేట్‌కు రావచ్చని పేర్కొన్నారు.

మైలవరం నుంచి పెన్నాకు నీరు విడుదల



మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

మైలవరం, సెప్టెంబరు 1: మైలవరం జలాశయం గేట్లు ఎత్తి 400 క్యూసె క్కుల నీటిని పెన్నానదికి వదిలినట్లు మైలవరం జలాశయ డీఈఈ నరసింహమూర్తి, ఏఈఈ గౌతమ్‌రెడ్డి తెలిపారు. గండి కోట జలాశయం నుంచి మైలవరానికి 20 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం నీటిని వదిలినట్లు తెలిపారు. పెన్నా పరివాహక ప్రాంత ప్రజల తాగు, సాగు నీటి అవసరాల కోసం పెన్నానదికి 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారు. గండికోట నుంచి మైల వరానికి ఇన్‌ఫ్లో పెరిగితే మరింత నీటిని పెన్నాకు వదులుతారని పెన్నాపరివాహక ప్రాంతీయులు అప్రమత్తంగా ఉండాలని జలాశయ అధికారులు తెలిపారు. మైలవరం జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 6.500 టీఎంసీలు కాగా ప్రస్తుతం మైలవరం జలాశయంలో 5.200 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

మైలవరానికి నీరు తగ్గింపు

కొండాపురం, సెప్టెంబరు 1: గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరానికి ఆదివారం నీటి విడుదల తగ్గించినట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. శనివారం నుంచి 20,000 క్యూసెక్కులు ఉన్న నీటి ప్రవాహాన్ని 2,500కు తగ్గించారు. ఇప్పటికే మైలవరంలో 5 టీఎంసీలకు పైగా నీరు ఉండడంతో సీఈ ఆదేశాల మేరకు నీటిని తగ్గించినట్లు డీఈ తెలిపారు. సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, పెడిపాలెం రిజర్వాయిర్‌కు 880 క్యూసెక్కులు, వామికొండ, సర్వరాయసాగర్‌కు 500 క్యూసెక్కుల చొప్పున గండికోట ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గండికోటలోకి జీఎన్‌ఎస్‌ఎస్ కెనాల్ ద్వారా 9500 క్యూసెక్కులు, వర్షపు నీటి ద్వారా 850 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉన్నట్లు డీఈ తెలిపారు. ప్రస్తుతం గండికోటలో 17.8 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

నెత్తురోడిన రహదారి

ఆగిన లారీని ఢీకొన్న స్కూటర్ ● ఇద్దరి మృతి



సంఘటన స్థలంలో వెంకటరమణ, దినేష్‌రెడ్డి మృతదేహాలు

ఖాజీపేట, సెప్టెంబరు 1: కడప-కర్నూలు జాతీయ రహదారిపై పాటిమీదపల్లె టోల్‌ప్లాజావద్ద నిలిచిన లారీని ఢీకొన్న ఘటనలో వెంకటరమణ (24), దినేష్‌రెడ్డి (19)మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు చింతకొమ్మదిన్నె మండలం పాపాసాహెబ్‌పేట వాసులు వెంకటరమణ, దినేష్‌రెడ్డి ప్రొద్దుటూరుకువెళ్లి స్కూటర్ కొనుగోలు చేసి అర్ధరాత్రి తిరిగి వస్తుండగా టోల్‌ప్లాజా వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్నారు. దీంతో వెంకటరమణ అక్కడికక్కడే మృతిచెందగా దినేష్‌రెడ్డిని చికిత్స నిమిత్తం టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న సీఐ మోహన్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. అర్ధరాత్రి కావడంతో వారిని గుర్తించడం పోలీసులకు కష్టతరమైంది. ఎట్టకేలకు వారిని గుర్తించి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీ - యువకుడు మృతి



షేక్ రఫీ, పక్కనే ఉన్న కుక్క

వేముల, సెప్టెంబరు 1: కడప-పులివెందుల ప్రధాన రహదారిపై భూమయ్యగారిపల్లె క్రాస్ వద్ద శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో షేక్ రఫి (33) మృతిచెందాడు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలిలాఉన్నాయి. శనివారం రాత్రి వేల్పుల గ్రామం బయట ఉన్న తోటకు కుక్కతో కలిసి వెళ్లి భూమయ్యగారిపల్లె క్రాస్ వరకు నడుచుకుంటూ వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో షేక్ రఫి మృతి చెందాడన్నారు. షేక్ రఫి అన్న ఆబావల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చెన్నూరు, సెప్టెంబరు 1: రాజంపేట బైపాస్‌రోడ్డుపై బచ్చుంపల్లె వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ఎం.గంగరాజు (63) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గంగరాజు, ఆయన కుమారుడు నిత్య పూజయ్య బేల్దారి పనిచేసుకుంటుండేవారు. రోజుమాదిరిగానే కడపలో బేల్దారి పనులు ముగించుకుని రాత్రి ఇర్కాన్ సర్కిల్ వద్ద దిగి స్వగ్రామం బచ్చుంపల్లెకు నడుచుకుంటూ వెళుతుండగా వెనుక నుంచి రాజంపేట వైపు వెళుతున్న ఏపీ 39 వీబీ 1375 నెంబరు లారీ ఢీకొంది. ఈ సంఘటనలో గంగరాజు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని 108లో రిమ్స్‌కు తరలించారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పోలీసులకు సవాల్‌గా మారిన దొంగతనాలు

బంగారు అంగట్లో చోరీ ● నెల రోజుల్లో మూడు చోట్ల...



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేపడుతున్న దృశ్యం

సుండుపల్లె, సెప్టెంబరు1: మండల కేంద్రంలో జరుగుతున్న వరుస దొంగతనాలు పోలీసులకు సవాల్‌గా మారింది. నెల రోజుల్లో మండల కేంద్రంలో మూడు చోట్ల దొంగతనాలు జరగడం ప్రజలను భయపెడుతోంది. శనివారం అర్ధరాత్రి తర్వాత మండల కేంద్రంలో నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆర్‌ఎస్ జ్యువెలర్స్‌లో దొంగతనం జరిగినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో తనిఖీ చేపట్టారు. షాపు యజమాని జగదీశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. 17 కిలోల వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు, వాటి విలువ రూ.11,90,000లు ఉంటుందన్నారు. షాపు లాకర్లో బంగారం ఉండడంతో లాకర్‌ను దొంగలు పగులగొట్టే ప్రయత్నాలు చేశారు.

సచివాలయం ఉద్యోగి బాధ్యతకు సలాం

- బెంగళూరు హాస్పిటల్‌లో పింఛన్ పంపిణీ



హాస్పిటల్‌లో పింఛన్ అందజేస్తున్న దృశ్యం

సంబేపల్లె, సెప్టెంబరు1: బెంగుళూరులోని ఆస్టర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న యర్రపురెడ్డి బసిరెడ్డికి ఆదివారం మోటకట్ల సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ గౌతమి పింఛన్ అందజేశారు. సంబేపల్లె మండలం మోటకట్ల గ్రామం చెంచురెడ్డిగారిపల్లె పింఛనుదారుడు బసిరెడ్డి కాలికి గాయం కావడంతో బెంగుళూరులోని ఆస్టల్ హాస్పిట ల్‌లో వారం రోజుల కిందట ఆపరేషన్ చేయించుకున్నారు. సెప్టెంబరు పింఛన్ పంపిణీ సమయంలో ఇంటి వద్ద లేకపోవడంతో వెల్ఫేర్ అసిస్టెంట్ ఆదివారం బెంగుళూరుకి వెళ్లి హాస్పిటల్‌లో పింఛన్ అందజేశారు.

ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్‌లో కోడూరు యువకుల ప్రతిభ



ప్రథమ బహుమతులతో విశ్వతేజ, భార్గవ్‌రామ్

రైల్వేకోడూరు(రూరల్) సెప్టెంబరు 1: ఇంట ర్నేషనల్ బ్యాడ్మింటన్ గ్రాండ్‌ప్రిక్స్ 2024 అండర్-19 విభాగంలో రైల్వేకోడూరు యువకులు గొబ్బూరు విశ్వతేజ, అరిగెల భార్గవ్ రామ్ జోడి మొదటి బహుమతి సాధించారు. పూణేలో ఆగస్టు 27 నుంచి జూనియర్ ఇంట ర్నేషనల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

ఆక్రమణలో అప్పన్నకుంట



కంప చెట్ల నడుమ అప్పన్నకుంట

కట్టతవ్వి యథేచ్ఛగా నిర్మాణాలు ● నాడు కుంట నేడు గట్టు ఆక్రమణ

మౌన ముద్రలో అధికారులు ● చోద్యం చూస్తున్న వైనం

సుండుపల్లె, సెప్టెంబరు1: మానవ మనుగడపై గాలి, కుంటలు, చెరువుల ప్రాముఖ్యత ఎంతో ఉంది. కుంటలు, చెరువులు ఉండడం వలన భూగర్భంలో జలవనరులు పెరిగి తాగు, సాగునీరు కొరత ఉండదు. కుంటలు, చెరువుల ప్రాముఖ్యత తెలుసుకుని తెలంగాణలో అక్కడ ప్రభుత్వం చెరువుల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను కూలుస్తున్నారు. కట్టుకున్నది ఎవరనే ప్రశ్నలేకుండా చెరువుల ఆక్రమణలపై కొరడా ఝులిపిస్తున్నారు. రాష్ట్రంలో అక్రమ నిర్మాణాలపై చర్యలు లేవు. వైసీపీ పాలనలో అడ్డూ అదుపు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో సుమారు 25 ఎకరాల్లో ఉన్న అప్పన్న కుంట రోజు రోజుకూ అస్తిత్వాన్ని కోల్పోతోంది. ప్రస్తుతం చాప కింద నీరులా ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. నాడు వైసీపీ పాలనలో అడ్డూ అదుపు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం చాపకింద నీరులా అక్రమ నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. వివరాల్లోకి వెళితే...

అప్పన్నకుంట సుమారు 20 ఏళ్ల కిందట మండల కేంద్రం నడి ఒడ్డున సుమారు 25 ఎకరాల్లో సర్వే నెంబరు 2169లో అప్పన్నకుంట ఉంది. ఈకుంట నుంచే మండల ప్రజలకు తాగు, సాగు నీటిని అందించేవారు. వందలాది ఎకరాల సాగుభూమికి సాగునీటిని అందించిన ఘనత ఈ కుంటకుంది. ఆక్రమణల కారణంగా అప్పన్నకుంట రాను రాను కుంచించుకుపోతోంది. చుట్టూ ఆక్రమణల కారణం గా కుంట విస్తీర్ణం రాను రాను తగ్గిపోతోంది. 2008లో వచ్చిన వరదల కారణంగా అప్పన్నకుంట తెగిపోయి మండలంలో సగం ఇండ్లు వరదనీటి ప్రవాహంలో మునిగిపోయాయి. అప్పట్లో పెద్ద మొ త్తంలో ఆస్తి నష్టం వాటిల్లింది. ప్రస్తుతం అలాంటి వర్షాలు కురవడం లేదు. కాబట్టి ఇటువంటి విప త్తులు కనిపించడం లేదు. అప్పన్నకుంట చుట్టూ కుంట కట్టను తవ్వి అక్రమ నిర్మాణాలు చేపట్టడం తో కుంట విస్తీర్ణం తగ్గిపోతోంది. భారీ వర్షాలు కురి స్తే మండల కేంద్రానికి పెద్ద ప్రమాదమే పొంచి ఉందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లగా కుంట చుట్టూ అంతులేని అక్రమాలు జరిగాయి. ఇదంతా అధికారులకు, పాల కులకు కనిపించడం లేదా అని విమర్శ లు వస్తున్నాయి. మండల కేంద్రంలో ఇంటి స్థలాలకు విపరీతమైన డిమాండ్ ఉండడంతో ఈ అక్రమాలు జరుగుతున్నాయి. ఇదంతా అధికారులకు తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కొందరు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. రాయచోటి ప్రధాన రహదారి పక్కన చర్చి వెనుక భాగంలో అప్పన్నకుంట కట్టను తవ్వి కుంటలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోనే కాకుండా కుంట దక్షిణ భాగంలో, తూర్పు భాగం సహా కుంటకు రెండు వైపులా ఉన్న మొరవను సైతం ఆక్రమించి నిర్మాణాలు చేసేశారు. తెలంగాణ మాదిరి కుంటలు, చెరువుల రక్షణకు అధికారులు చర్యలు చేపడతారా లేదా వేచి చూడాలి. అక్రమ నిర్మాణాలు నిలపాలని, కుంటను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.





కుంటను ఆక్రమించి చేపడుతున్న ఇంటి నిర్మాణం - ఆక్రమణల కోసం చదును చేసిన కుంట స్థలం

తేడా కనిపించడం లేదు

వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమయ్యాయి. గుట్టలు, వాగులు, వంకలు, చెరువులు, కుంటలు అనే తేడా లేకుండా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారు, కొందరు అమ్ముకున్నారు. ప్రభుత్వం మారిందే కానీ వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై చర్యలు మాత్రం కనిపించడం లేదు. ప్రభుత్వం మారినా అక్రమాలు చేస్తున్న వారు ఇంకా చేస్తూనే ఉన్నారు. అప్పట్లో లక్షలాది రూపాయలు ప్రభుత్వ స్థలాలు అమ్మి సొమ్ము చేసుకున్న వారు ప్రస్తుతం తమకు ఏమీ తెలియనట్లు ఉంటున్నారు. అధికారులు సైతం అప్పుడు జరిగిన వాటిపై కదా మాకేమీ సంబంధం అన్న తీరుతో వ్యవహరిస్తున్నారని కూటమి నేతలు విమర్శిస్తున్నారు. ఆ ప్రభుత్వంలో కుంటలను ఆక్రమించి నిర్మాణాలు ఈ ప్రభుత్వంలో కుంట కట్టలను ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. రెండు ఒక్కటే కదా తేడా ఏమీ కనిపించడం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుంట ఆక్రమణలకు గురవుతున్నా ఎందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు అనేది తెలియాల్సి ఉంది.

అక్రమ నిర్మాణాన్ని వెంటనే ఆపుతాము

కుంట, చెరువులు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాము. అప్పన్నకుంటలో అక్రమ నిర్మాణాలు చేస్తున్నట్లు ఆదివారం తెలిసింది. వెంటనే రెవెన్యూ సిబ్బందితో కుంటలు అక్రమ నిర్మాణాలను నిలిపివేస్తాము. అప్పన్నకుంటలో ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.

దైవాదీనం, తహసీల్దార్, సుండుపల్లె

హిందూ హక్కుల రక్షణకు అలుపెరుగని పోరు

ఆత్మీయ హిందూ సమ్మేళనంలో వీహెచ్‌పీ అఖిలభారత మార్గదర్శక మండలి సభ్యులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న విరజానందస్వామి

కడప (కల్చరల్) సెప్టెంబరు 1: విశ్వహిందూ సమాజం హక్కుల, రక్షణ కోసం అలుపెరుగని పోరు సాగించేందుకు వెనుకాడే ప్రసక్తే లేదని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అఖిల భారత మార్గదర్శక మండలి సభ్యుడు విరజానందస్వామి స్పష్టం చేశారు. విశ్వవ్యాప్తంగా వున్న వేలాది ధార్మిక సంస్థల ఏకైక విశ్వ వేదిక విశ్వహిందూ పరిషత్ అన్నారు. 1964లో శ్రీ కృష్ణ జయంతి రోజున ఏర్పాటైన వీహెచ్‌పీ అంచెలంచెలుగా సుమారు వంద దేశాలకు విస్తరించి, యావత్ భారతంలోని సమస్త ధర్మాచార్యులు, సాధుసంతుల ఆశీస్సుల బలంతో నిరంతరం వికసిస్తూ ముందుకు సాగుతోందన్నారు. వీహెచ్‌పీ ఏర్పాటై 60 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా నగర వీహెచ్‌పీ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక చిన్మయమిషన్ లలితా పంచాయతన దేవాలయంలో వీహెచ్‌పీ దక్షిణాంధ్ర ప్రాంత ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ బెస్తవేముల రామ్‌మహేష్ అధ్యక్షతన కడప నగర ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హిందూ సమాజం అన్ని వైపుల నుంచీ దాడులకు గురౌతున్న సమయంలో 'యథా యథాహి ధర్మస్య' అన్న రీతిలో కృష్ణాష్టమి రోజున భారతగడ్డ మీద ఆవిర్భవించిన సంస్థగా ఖ్యాతిగాంచిందన్నారు. ప్రధానంగా అయోధ్య ఉద్యమం చరిత్రను మలుపు తిప్పిందన్నారు. ప్రతి హిందువు తనను తాను హిందువు అని చెప్పుకునే స్థితికి తీసుకువచ్చిందన్నారు. ముఖ్యంగా తమ వీహెచ్‌పీ కీర్తిపతాకం దేశ విదేశాల్లో ఎగరటానికి ప్రధాన కారణం ఆందోళనాత్మక కార్యక్రమాలే అన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ భాగ్యనగర్ క్షేత్ర సంఘటన కార్యదర్శి గుమ్మళ్ల సత్యం, దక్షిణాంధ్ర ప్రాంత మార్గదర్శక మండలి సభ్యులు తురీయానంద సరస్వతిస్వామి, పూర్వప్రాంత అధ్యక్షుడు బైరెడ్డి రామకృష్ణారెడ్డి, ప్రాంత కార్యదర్శి కాకర్ల రాముడు, జిల్లా ఉపాధ్యక్షురాలు హేమమాలిని, కార్యదర్శి మనోహర్, పలువురు హిందూ బంధువులు, ధార్మిక సంస్థల కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా హాజరైన వారికి శ్రీరామ అక్షింతలు పంపిణీ చేశారు.

బహిరంగ మద్యపానంపై దాడులు

● నెల రోజుల్లో 2096 మందిపై కేసులు

● గంజాయి, గ్యాంబ్లింగ్, మట్కా, అక్రమ ఇసుక రవాణా, అక్రమ మద్యంపై ఉక్కుపాదం

● ఎస్పీ హర్షవర్ధన్‌రాజు వెల్లడి

కడప (క్రైం), సెప్టెంబరు 1: జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆగస్టులో పలు నేరాలపై ముమ్మరంగా దాడులు నిర్వహించి కేసులు నమోదు, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, గంజాయి విక్రయాలు, గ్యాంబ్లింగ్, మట్కా నిర్వాహకులపై దాడులు, ఇసుక అక్రమరవాణా, అక్రమ మద్యంపై దాడులు చేపట్టి ఉక్కుపాదం మోపారు. జిల్లా పోలీసుశాఖ పనితీరుపై గణాంకాలను ఆదివారం ఎస్పీ ప్రకటన విడుదల చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై పోలీసు సిబ్బంది ముమ్మర దాడులు నిర్వహించి 2096 మందిపై కేసులు నమోదు చేశారు. గంజాయి విక్రేతలపై దాడులు నిర్వహించి 25.01 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, 12 కేసులు నమోదు చేసి 34 మందిని అరెస్టు చేశారు. గ్యాంబ్లింగ్ కేసుల్లో 61 కేసులు నమోదు చేసి, 354 మంది జూదరులను అరెస్టు చేసి రూ.9,03,890 నగదు స్వాధీనం చేసుకున్నారు. కోడిపందాల్లో 12 మందిని అరెస్టు చేసి రూ.24,300 నగదు స్వాధీనం, కేసు నమోదు చేశారు. మట్కా నిర్వాహకులపై 23 కేసుల్లో 50 మంది అరెస్టు, రూ.4.94 లక్షలు నగదు స్వాధీనం, ఇసుక అక్రమ రవాణాలో 64 మంది అరెస్టు, 48 కేసులు, 181 టన్నుల ఇసుకను సీజ్ చేసి 52 వాహనాలను సీజ్ చేశారు. అక్రమ మద్యం విక్రయాల్లో 4429.37 లీటర్లను స్వాధీనం చేసుకుని 30 కేసుల నమోదు, 39 మందిని అరెస్టు చేశారు.

మహిళలను అడ్డుకున్న రోప్ పార్టీ

● బయటి జిల్లాల అభిమానులకు చుక్కెదురు



జగన్‌జూజీ కలిసేందుకు వెళుతున్న వారిని అడ్డుకుంటున్న రోప్ పార్టీ

పులివెందుల టౌన్, సెప్టెంబరు 1: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై అభిమానంతో సుదూర ప్రాంతాల నుంచి కలవడానికి వచ్చిన మహిళలపై రోప్ పార్టీ పోలీసులు దాష్టీకం చూపించారు. సుదూర ప్రాంతాల నుంచి జగన్‌ను కలిసేందుకు పెద్దఎత్తున తరలివచ్చిన అభిమానులపై ఇలా పోలీసులు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. మాజీ సీఎం వైఎస్‌జగన్ వైఎస్ఆర్ కడప జిల్లా మూడురోజుల పర్యటనలో భాగంగా రెండోరోజు పులివెందులలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌ను కలవడానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. అయితే వారిపై రోప్ పార్టీ పోలీసు సిబ్బంది దురుసుగా ప్రవర్తించారు. జగనన్నను కలిసేందుకు వచ్చిన తమపై చొక్కాలు పట్టి లాగడం, మహిళలు అని చూడకుండా చేతులు వేసి నెట్టడం దారుణమని వాపోతున్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని కలిసేందుకు చిత్తూరు జిల్లా బంగారుపాలెం నుంచి పెద్దఎత్తున మహిళలు తరలివచ్చారు. తమ అభిమాన నాయకుడిని చూసేందుకు వచ్చిన మాపై ఇలా ప్రవర్తించడం ఎంత వరకు కరెక్ట్ అంటూ వారు పోలీసులతో వాగ్వావాదానికి దిగారు.

160 గోవా మద్యం బాటిళ్లు పట్టివేత

ముద్దనూరు, సెప్టెంబరు 1: స్థానిక చిన్నదుద్యాల క్రాస్ వద్ద శనివారం నలుగురిని అదుపులోకి తీసుకుని 160 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ గద్దం నాయుడు తెలిపారు. రాబడిన సమాచారం మేరకు సింహాద్రిపురం, కొండాపురం మండలాల వాసులు నలుగురు మద్యం బాటిళ్లను తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని గోవాకు చెందిన 160 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

నిందితులపై కేసు నమోదు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 1: శివాజీ రెస్టారెంట్‌పై, పనిచేస్తున్న సిబ్బంది, యజమానిపై విచక్షణా రహితంగా దాడి చేసిన ఘటనలో కొండారెడ్డి, ప్రతాప్‌రెడ్డిపై కేసు నమోదు చేశారని ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు దాడిచేసిన సాలాబాదు గ్రామస్తులు కొండారెడ్డి, ప్రతాప్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. మండలంలో విద్వేషాలను రెచ్చగొడుతూ దాడులు చేయడం ఆనవాయితీగా పెట్టుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలను చేతుల్లోకి తీసుకుని రౌడీయిజం చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం - కేసు నమోదు

చిన్నమండెం, సెప్టెంబరు1: అక్రమంగా ఇసుక తరలిస్తుండగా గ్రామస్తుల ఫిర్యాదుపై ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుని ఎస్‌ఐ సుధాకర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వండాడి పంచాయతీ మల్లూరు చాకిబండ రహదారి పక్కన రాత్రింబవళ్లు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు, మాజీ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుని శనివారం రాత్రి చిన్నమండెం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి వెళ్లిన ఎస్‌ఐ సుధాకర్ ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గొలుసు చోరీ

చెన్నూరు, సెప్టెంబరు 1: రామనపల్లెకు చెందిన మజ్జారి అరుణకుమారి మెడలో గుర్తు తెలియని వ్యక్తి గొలుసు లాక్కుని వెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. గత నెల 29న ఉదయం 11గంటలకు ఇంటి బయట బట్టలు ఉతుకుతుండగా వెనక నుంచి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఒక్క మారుగా మెడలోని గొలుసు లాక్కుని వెళ్లాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళ అదృశ్యం

కడప (క్రైం), సెప్టెంబరు 1: స్థానిక శంకరాపురం స్కౌట్ హాల్ వద్ద ఉన్న ఓ మహిళ అదృశ్యమైనట్లు చిన్నచౌకు పోలీసులు తెలిపారు. హరినగరి సుభాషిణి కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేది. ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైనట్లు తెలిపారు. అదృశ్యమైన సుభాషిణి కుమార్తె తేజస్విని ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.


రాజంపేట: కేక్ కట్‌చేస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం, టీడీపీ నాయకులు


సుండుపల్లి: ఆంజనేయస్వామి ఆలయ వద్ద టెంకాయలు కొట్టి పూజలు చేస్తున్న కూటమి నేతలు


నందలూరు: కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ కార్యకర్తలు


ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా (ఫైల్ ఫొటో)

పేదల పక్షపాతి చంద్రబాబు

సుండుపల్లె, సెప్టెంబరు 1: పేదల పక్షపాతి సీఎం చంద్రబాబు నాయుడు అని కూటమి నేతలు తెలిపారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు 30వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా ఆదివారం మండలంలోని తిమ్మనసముద్రం ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని కోరుకునే చంద్రబాబు ఆరోగ్యంగా ఉండాలని నిండునూరేళ్లు వర్ధిల్లాలని 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శివకుమార్‌నాయుడు, శివరాం నాయుడు, మేకల మహబూబ్‌బాషా, దామోదర్‌నాయుడు, సురేశ్ నాయుడు, చంద్రమౌళి, యర్రంరెడ్డి, సుబ్బరామయ్య, జనసేన మహిళా నాయకురాలు రెడ్డిరాణి, రామాశ్రీనివాస్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు బెల్లాల రమణ, మోహన్ బాబు నాయుడు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్: రాజంపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో 29 సంవత్సరాల తెలుగు జాతి ప్రగతి ప్రయాణాన్ని గుర్తు చేసుకుందాం రండి అన్న పిలుపుతో కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా సుగవాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలుగు రాష్ట్రాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన మహా నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, రాజంపేట పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు తరిగొపుల లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, మండల మాజీ ఉపాధ్యక్షుడు నాగా సుధాకర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు బాసినేని వెంకటేశ్వర్లునాయుడు, రాజంపేట పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి సంజీవరావు, రాజంపేట పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, టీడీపీ నాయకులు నాగేశ్వరనాయుడు, మందపల్లె శ్రీనివాసులు, మేకా నరసింహులు, కొల్లు రెడ్డయ్యనాయుడు, చెంగల్‌రాయుడు, సుబ్బరాయుడు, మాజీ సర్పంచ్ ఎంఎల్ నారాయణ, న్యాయవాది సింగంశెట్టి కృష్ణకుమార్, ఒంటిమిట్ట మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, భువనగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ధర్మకర్త బైల్స్ నరసింహ, డీలర్ల సంఘం అధ్యక్షుడు సుధీర్, అబ్బిగారి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: సంక్షేమ ప్రదాత, అభివృద్ధి సాధకుడు, అవిశ్రాంత పోరాటయోధుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా అన్నారు. 1995 సెప్టెంబరు నెల 1వ తేదీన తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి నేటి వరకు ఆంధ్రప్రదేశ్ ప్రజల దిశను మార్చి రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలపాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్న మహోన్నత వ్యక్తి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే సమయంలో ఎన్నో అవకతవకలు, ఎదురుదెబ్బలు, వెన్నుపోటులు, కక్ష సాధింపు చర్యలు, ప్రాణపాయ పరిస్థితులు, అక్రమ అరెస్టులు ఇలా ఎన్నో ఎదుర్కొంటూ.. రాష్ట్రాన్ని కాపాడుతూ వస్తున్న చంద్రబాబుకు ఏమిచ్చినా రుణం తీరదన్నారు.

నందలూరు : నందలూరులో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో జంగంశెట్టి సుబ్బయ్య మండల టీడీపీ కార్యదర్శి గొబ్బిళ్ల సుబ్బరాయుడు, నాయకులు బూశెట్టి వెంకటసుబ్బయ్య, పాటూరు రమేష్, వేణుగోపాల్, రెమో సురేష్, పసుపులేటి ప్రవీణ్, ఉప్పుశెట్టి రెడ్డయ్య, మోడపోతుల రాము, నారపుశెట్టి శివ, తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

నేడు రైల్వేకోడూరుకు మంత్రి మండిపల్లి రాక


రాజ్ కన్వెన్షన్ వద్ద జనసేన నేతలు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 1: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోమవారం రైల్వే కోడూరుకు రానున్నారు. పట్టణంలోని రాజ్ కన్వెన్షన్‌లో నిర్వహించే కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఆదివారం ఈ సందర్భంగా జనసేన నాయకులు, కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటలకు రక్తదానం, 10.15 కు మొక్కలు నాటే కార్యక్రమం, 10.30 కి జ్యోతిప్రజ్వలన, 10.50కి కుట్టుమిషన్లు పంపిణీ, 12 గంటలకు పారిశుధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ, 12.20కి అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం, 12.30కతి అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసిన వారికి సన్మానం తదితర కార్యక్రమాలు ఉంటాయని జనసేన నాయకులు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ సీనియర్ నాయకుడు ఎమ్మెల్సీ చెన్నంశెట్టి రామ చంద్రయ్య, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాజకీయ కార్యదర్శి, ఎమ్మెల్సీ పిడుగు హరి ప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు, రాజంపేట టీడీపీ ఇన్‌చార్జ్ సుగవాసి బాలసుబ్రహ్మణ్యం తదితరులు హాజరు అవుతారని జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర తెలిపారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న ఆర్యవైశ్యులు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 1: అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న అని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు కల్వకుంట్ల చంద్రసేనగుప్త తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరు ఆర్యవైశ్య సమాజంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వక్తలు రక్తదానం ఆవశ్యకతను వివరించారు. పలువురు రక్తదానం చేశారు. వాసవి క్లబ్ గవర్నర్ సీహెచ్ వెంకటేశ్వర్ రావు, జిల్లా కేబినెట్ కార్యదర్శి పెండ్యాల విజయ్‌కుమార్, జోన్ చైర్మన్ గాధంశెట్టి సుమన్ కుమార్, రీజియన్ కార్యదర్శి వేమా కిషోర్‌బాబు, క్లబ్ అధ్యక్షుడు తిరుమామల కుమార్, కార్యదర్శి సత్య, కోశాధికారి శేఖర్, వనిత క్లబ్ అధ్యక్షురాలు వేమా మంజుల, గునిశెట్టి భ్రమరాంబ, ఆర్యవైశ్య నాయకులు మేడా వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ బెంగళూరు ఫోరం వార్షికోత్సవం



కార్యక్రమానికి హాజరైన చిన్నమండెం మండలానికి చెందిన ఐటీ ఉద్యోగులు

చిన్నమండెం, సెప్టెంబరు1: బెంగుళూరు టీడీపీ ఫోరం (బీటీఎఫ్) స్థాపించి 10 సంవత్సరాలు దాటిన సందర్భంగా నవశకం.. మళ్లీ మంచి రోజులు వచ్చేశాయి.. అన్న స్లోగన్‌తో ఆదివారం బెంగుళూరులో సదస్సు నిర్వహించారు. రాష్ట్ర మంత్రి సవిత, ఎమ్మెల్సీలు రాంభూపాల్‌రెడ్డి, కంచికచర్ల శ్రీకాంత్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్నాథ, కల్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు పాల్గొన్నారు. చంద్రబాబును అరెస్టు చేసిన సందర్భంగా బెంగుళూరు టీడీపీ ఫోరం సభ్యులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారని, కూటమి ప్రభుత్వం ఏర్పాటులో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో చిన్నమండెంకు చెందిన చంద్రశేఖర్, పెద్దయ్య, సుధాకర్, సురేశ్, రాజు, వెంకట్, వెంకటాద్రి, ప్రతాప్, గణేశ్ మరికొంత మంది ఐటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ దాడులకు సీఐటీయూ నిరసన

రాయచోటిటౌన్, సెప్టెంబరు 1: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులకు నిరసనగా పట్టణంలోని డైట్ కేంద్రం ఎదుట ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ చంద్రశేఖర్, రామాంజులు మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి నిబంధనలను ఉల్లంఘించి పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని ఖండించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, ఏవీ రమణ, రాజేశ్వరి, శ్రీలక్ష్మి, సుజాత, ఐద్వా జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ, సీఐటీయూ లీడర్లు బంగారుపాప, ఖాజాబీ, మాధవయ్య, నాగమణి, షాహినా పాల్గొన్నారు.

సీనియర్ టీడీపీ, బీజేపీ నేతల భేటీ


చర్చించుకుంటున్న ఎద్దుల సుబ్బరాయుడు, పీవీఎస్ మూర్తి

రాజంపేట, సెప్టెంబరు 1 : రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకుడు పీవీఎస్ మూర్తి, మాజీ ఆర్టీసీ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు ఆదివారం కడపలో భేటీ అయ్యారు. రాజంపేట నియోజకవర్గ రాజకీయాలపై చర్చించారు. టీడీపీ, బీజేపీ, జనసేన కలయిక వల్లే రాష్ట్రం తిరిగి అభివృద్ధి పథంలో నడవనున్నదని తెలిపారు. ఉమ్మడి అభివృద్ధి ప్రణాళికను తయారు చేసుకుని రాజంపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. నియోజకవర్గం లోని ప్రధాన కూటమి నాయకులతో సమావేశమై ఇటు రాజకీయాలపై, అటు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గీతాంజలి విద్యా సంస్థల అధినేత ఎస్వీ రమణ, సౌమ్యనాథస్వామి అన్నదాన ట్రస్టు చైర్మన్ సుబ్బరామయ్య, జనసేన నాయకులు అబ్బిగారి గోపాల్, రమణ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాలమ్మకు పూజలు


మల్లాలమ్మకు పూజలు చేస్తున్న గ్రామ నాయకులు

రామాపురం, సెప్టెంబరు 1: మండలంలోని కసిరెడ్డిగారి పల్లె పంచాయతీ సూర్యనారాయణ పురంలో ఆదివారం గ్రామ ప్రజలు మేదర్ల కులదేవత మల్లాలమ్మ ఆలయం నిర్మించి, పూజలు నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ అమ్మవారికి పొంగుబాలు సమర్పించారు. ఈ గ్రామంలోని మేదర కులస్థులు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేఖం నారాయణ, బండారు తిమ్మారెడ్డి, చిట్టి రెడ్డెయ్య, కృష్ణయ్య, మావిళ్లపల్లె శివయ్య, రఘురాం, కడవకూటి సుబ్బరాయుడు, బంకు సుబ్బయ్య, రంగస్వామి, నాగరాజు, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతి కోసమే దళితమిత్ర సంఘం ఏర్పాటు

సంబేపల్లె, సెప్టెంబరు 1: దళితుల అభ్యున్నతి కోసమే దళిత మిత్ర సంఘాలను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర అధికార ప్రతినిధి పెడబల్లి నాగభూషణం తెలిపారు. ఆదివారం సంబేపల్లె మండల సంఘం అధ్యక్షుడుగా యువరాజు, ఉపాధ్యక్షుడుగా వెంకట్రమణ, కలకడ మండల అధ్యక్షుడుగా కోన నాగరాజును నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డెప్ప, అడవికమ్మపల్లి ఎంపీటీసీ సభ్యుడు రామరాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పోటాపోటీగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

రైల్వేకోడూరు(రూరల్) సెప్టెంబరు 1: నియోజకవర్గ కేంద్రంలో జనసేన కార్యకర్తలు నేడు పోటాపోటీగా పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలను నిర్వహిస్తున్నారు. మైసూరివారిపల్లె పంచాయతీలో యనమల భాస్కరరావు ఆధ్వర్యంలో జనసేన కార్యాలయంలో, పట్టణంలోని రాజ్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి, రాజకీయ ప్రముఖులు పాల్గొంటున్నారు. ఇలా పలు ప్రాంతాల్లో వేరువేరుగా పవన్ కార్యక్రమాలునిర్వహిస్తున్నారు. ఇది ఇలా ఉండగా యనమల భాస్కరరావు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని కొందరు చించి వేయడంతో వివాదం చోటుచేసుకుంది. దీంతో వేడుకల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకుంటాయో అని కూటమినేతల్లో ఆందోళన నెలకొంది.

మంత్రి ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ

- తరలివచ్చిన నాయకులు, బాధితులు


ప్రజల సమస్యలపై ఆరాతీస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు1: రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం తమ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజ లు పెద్దఎత్తున వినతిపత్రాలు సమర్పించారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయానికి చేరుకున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని టీడీపీ కార్యకర్తలు, అభిమానులు గజమాలతో సన్మానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ప్రజా దర్బార్‌లో స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమస్యలను సీరియస్‌గా తీసుకుని వాటి పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, సమస్యలు పరిష్కరిస్తామని వారికి భరోసానిచ్చారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

- ఏపీ రైతు సంఘం, సీపీఐ నేతల డిమాండ్



జెండాను ఆవిష్కరిస్తున్న ఏపీ రైతు సంఘం, సీపీఐ నేతలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు1: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల న్యాయమైన కోరికలను తీర్చాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు డిమాండ్ చేశారు. సెప్టెంబరు 1న రైతుల కోర్కెల దినం సందర్భంగా ఆదివారం రాయచోటి పట్టణంలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా రైతులు గిట్టుబాటు ధరలు లేక సతమతమవుతున్నర రైతులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ పోరాటాలు చేసినా ఫలితం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు, 90 శాతం సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు అందజేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మండెం సుధీర్‌కుమార్, రైతు సంఘం సుండుపల్లె మండల అధ్యక్షులు సిద్దారెడ్డి, శేఖర్‌రెడ్డి, రమణయ్య, భాస్కర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

భారతీయ న్యాయ సంహిత పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న లయన్స్, వాకర్స్ క్లబ్ సభ్యులు

నందలూరు, సెప్టెంబరు 1 : లయన్స్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అరవపల్లెలో డాక్టర్ జయభాస్కర్‌రావు కార్యాలయంలో నూతన చట్టాలతో రూపొందించిన భారతీయ న్యాయ సంహిత (ఇంగ్లీష్ వెర్షన్) పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విభ ఎరుడైట్ స్కూల్ చైర్మన్ డాక్టర్ బచ్చు జయభాస్కర్‌రావు మాట్లాడుతూ పుస్తక పఠనం మనిషి ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందని విద్యార్థి దశ నుంచి జ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాల అవసరం ఎంతో ఉందన్నారు. విద్యార్థులకు అవసరమయ్యే మరిన్ని మంచి పుస్తకాలను తమ స్కూల్ గ్రంథాలయంలో ఏర్పాటు చేయడానికి నిర్ణయించామని తెలిపారు. ఎస్ఐ మన్యం రామ్మోహన్ మాట్లాడుతూ చిరిగిన చొక్కా అయినా వేసుకో... కానీ, ఒక మంచి పుస్తకం కొనుక్కో అని పెద్దలు చెప్పారని, ఆ స్ఫూర్తిని ఆధారంగా చేసుకుని విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే విధంగా మంచి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించిన డాక్టర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లయన్ కుమారమణియాదవ్, లయన్ కొత్తపల్లి రాజాచారి, న్యాయవాది దాసరి నరసింహులు, వాకర్ మోడపోతుల రాము, వాకర్ గుండు సురేష్, హెచ్‌డి ప్రసాద్, గంధం గంగాధర్, ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా బీజేపీ సభ్యత్వ నమోదు


సమావేశంలో మాట్లాడుతున్న నాగోతు రమేష్‌నాయుడు

నందలూరు, సెప్టెంబరు 1 : మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి అట్టహాసంగా శ్రీకారం చుట్టనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంపై రాజంపేట అసెంబ్లీ కోకన్వీనర్ డాక్టర్ అరిగె రాంప్రసాద్ అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనరంజక పాలనకు తోడ్పాటు అందించాలంటే బీజేపీ సభ్యత్వం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, గిరిజన మోర్చా కార్యదర్శి పోతురాజు మస్తానయ్య, బీజేపీ నాయకులు విఠలాచార్య, హిమగిరినాథ్, ఆదినారాయణ, రమణ, మండల అధ్యక్షుడు శివారెడ్డి, కార్యదర్శి మురళి, యువమోర్చా వెంకటరమణ, జయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడప దర్గా ఉత్సవాలకు సుగవాసికి ఆహ్వానం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 1: ఈ నెల 4, 5 తేదీల్లో జరగనున్న కడప అమీన్‌పీర్ పెద్ద దర్గా గంధం, ఉరుసుకు టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబుకు దర్గా కమిటీ తరపున ఆహ్వానం అందింది. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో దర్గా పీఠాధిపతుల శిష్య బృందం ఆహ్వాన పత్రికను అందజేసింది.

బీజేపీ కార్యాలయ ప్రారంభోత్సవానికి నల్లారికి ఆహ్వానం

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 1 : మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయ ప్రారంభోత్సవానికి మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డిని ఆహ్వానిస్తున్నట్లు బీజేపీ యువ నాయకుడు చిన్నరెడ్డి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. పలువురు వైసీపీ నేతలు బీజేపీ వైపు మొగ్గు చూపుతుండడంతో ఈ ఏర్పాట్లు చేస్తున్నట్లు మండల అధ్యక్షుడు చిన్నరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.

పారిశుధ్య పరిరక్షణకు చర్యలు


ఓబులవారపల్లె, సెప్టెంబరు, 1 : మండల కేంద్రంలో పారిశుధ్యయ రక్షణ చర్యలు చేపడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి భారతి తెలిపారు. ఓబులవారిపల్లె గ్రామంలో ప్రధాన వీధుల్లో పిచ్చి మొక్కలను, మురుగునీటిని తొలగించారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో దోమలు వ్యాప్తి చెంది రోగాలబారిన పడకుండా ఈ చర్యలను పాటిస్తున్నట్లు సర్పంచ్ జయపాల్‌రెడ్డి తెలిపారు.

రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి


జెండా ఆవిష్కరిస్తున్న తుమ్మల రాధాకృష్ణయ్య

రైల్వేకోడూరు, సెప్టెంబరు 1: రైతు వ్యతిరేక చట్టాలను ప్రభుత్వాలు వెంటనే రద్దు చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయ ఆవరణలో రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, సీపీఐ సీనియర్ నాయకుడు తుమ్మల రాధాకృష్ణయ్య పతాకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యానికి గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎంఎస్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని తెలిపారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ. 40 వేలు పరిహారం ఇవ్వాలని డిమాండు చేశారు. రైతు రుణాలను వెంటనే మాఫీ చేయాలన్నారు. జీవో నెం. 22, స్మార్ట్ మీటర్లను తక్షణమే రద్దు చేయాలన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని తక్షణమే వర్తింప జేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు పండుగోల మణి మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఉద్యాన పంటలను రైతులు పండిస్తున్నారని తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే శీతలగిడ్డంగులు ఏర్పాటు చేయాలని, అరటి రైతులకు రైపనింగ్ ఛాంబర్ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో మండల సీపీఐ కార్యదర్శి దార్ల రాజశేఖర్, మండల సహాయ కార్యదర్శి గంగాపూరి తేజ్‌కుమార్, స్థానిక నాయకులు చెన్నూరు సత్యం, గంగయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు సిద్ధమవుతున్న గ్రామాలు


విద్యుత్ దీపకాంతుల్లో ఇండ్లూరులోని సిద్ధి వినాయకస్వామి దేవాలయం

పెనగలూరు, సెప్టెంబరు 1 : వినాయకచవితి ఉత్సవాలకు గ్రామీణ ప్రజలు సమాయత్తమవుతున్నారు. చందాల సేకరణ, మండపాల ఏర్పాటుపై యువత బిజీగా ఉన్నారు. పెనగలూరు పంచాయతీ కొత్తపల్లి ఇండ్లూరు గ్రామాల్లోని వినాయకస్వామి ఆలయాలున్నాయి. సిద్ధి వినాయకస్వామి దేవాలయంలో ప్రతి ఏటా కల్యాణోత్సవం నిర్వహిస్తుండగా, ఈ ఏడు పి.కొత్తపల్లిలో నిర్మించిన కార్యసిద్ధి వినాయకస్వామి ఆలయంలో కూడా కల్యాణోత్సవాన్ని జరిపించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇక్కడ పది రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని గ్రామ ప్రజలు తీర్మానించు కున్నారు.

ద్రవజీవామృతం తయారీపై అవగాహన

చిన్నమండెం, సెప్టెంబరు1: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ద్రవ జీవామృతం తయారీ, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంతో రైతుకు, పర్యావరణానికి మేలు కలుగుతుందని మండల పాయింట్ పర్సన్ సుబ్రమణ్యంఆచారి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, యూనిట్ ఇన్‌చార్జి రమణ, డిజిటల్ యూనిట్ ఇన్‌చార్జి వెంకటమల్లయ్య, ఐసీఆర్‌పీలు ఇంద్రావతి, కృష్ణమ్మ, రమాదేవి, గ్రామ సంఘం అధ్యక్షురాలు నాగస్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి



రాయచోటి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు1: ఉపాధ్యాయులకు నష్టం కలిగించే విధంగా గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఆధ్వర్యంలో రాయచోటి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా ఉన్న జీపీఎస్ విధానాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బీలూ నాయక్, రాయచోటి మండల అధ్యక్షుడు మహమ్మద్‌అలీ, సీపీఎస్ నాయకులు అంజనేయులు, విష్ణువర్ధన్, రమేశ్, రామచంద్రారెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి

లక్కిరెడ్డిపల్లె సెప్టెంబరు 1: గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధులను అరికట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న కోరారు. ఆదివారం లక్కిరెడ్డిపల్లెలో విలేకర్లతో మాట్లాడుతూ అనారోగ్యం బారిన పడిన ప్రజలు ఎక్కువగా ప్రైవేటు ఆసుపత్రులకు వెళుతుండడంతో వారు వేలాది రూపాయలు దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ వైద్యులు గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లక్కిరెడ్డిపల్లె కమ్యూనిటి, దేవళంపల్లె, కోనంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆయన అధికారులను కోరారు. పీడీఎస్‌యూ చంద్రశేఖర్, స్వరూపతేజ, అనిల్ తదితరులు పాల్గొన్నారు



తిరుపతికి అంతర్జాతీయ విమానం వచ్చేసిందోచ్!



డాక్టర్ రవిపిళ్లైకి స్వాగతం పలుకుతున్న కోలా ఆనంద్

రేణిగుంట, సెప్టెంబరు 1: ఎట్టకేలకు తిరుపతి విమానాశ్రయంలో తొలిసారిగా ఓ అంతర్జాతీయ విమానం సేఫ్‌గా ల్యాండైంది. 2015 నవంబరు 22వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ద్వారా తిరుపతిలో అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభించి జాతికి అంకితం చేశారు. చంద్రబాబు ముందుచూపుతో అప్పట్లోనే అంతర్జాతీయ విమాన రాకపోకల కోసం అన్ని వసతులను కల్పించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అంతర్జాతీయ విమానాల రాకపోకలపై దృష్టి సారించలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడటం, తిరిగి చంద్రబాబు సీఎం అయిన మూడు నెలల్లోపే అంతర్జాతీయ విమానం రావడంతో ఇటువంటి విమానాల రాకపోకలకు తొలి అడుగు పడిందనే చెప్పుకోవాలి. ఆదివారం మధ్యాహ్నం 12.11 గంటలకు బహ్రెయిన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఎంపైర్ ఏవియేషన్ విమానం నేరుగా తిరుపతి విమానాశ్రయంలో ల్యాండైంది. గల్ఫ్‌దేశంలో స్థిరపడిన కేరళకు చెందిన ప్రవాస భారతీయుడు డాక్టర్ రవిపిళ్లై కుటుంబ సభ్యులతో కలిసి ఈ విమానంలో శ్రీవారి దర్శనార్థం తిరుపతికొచ్చారు. ఏటా శ్రీవారి దర్శనానికి వచ్చే ఈయన ఈసారి కేంద్రప్రభుత్వ అనుమతితో ప్రత్యేక విమానంలో వచ్చారు. దీనివల్ల భవిష్యత్తులో అంతర్జాతీయ విమాన సర్వీసులు నడపడానికి ఇది తొలి అడుగుగా విమానాశ్రయ అధికారులు భావిస్తున్నారు. కాగా, రవిపిళ్లైకి విమానాశ్రయంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ స్వాగతం పలికారు.



శ్రీవారి సేవలో హన్సిక

సినీ నటి హన్సిక ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తన తల్లి మోనా మొత్వానితో కలిసి ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. వీరికి ఆలయ సిబ్బంది లడ్డూప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయం ముందుకు వచ్చిన హన్సికను అభిమానులు ఆసక్తిగా చూశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



వేణుప్రసాద్ (ఫైల్ ఫొటో)

పుంగనూరు రూరల్, సెప్టెంబరు1: ఉదయం పుట్టిన రోజు చేసుకుందామని స్నేహితులతో చెప్పి బయలుదేరిన కాసేపటికే ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. పట్టణంలోని ఎన్ఎస్‌పేటకు చెందిన నారాయణ కుమారుడు వేణుప్రసాద్(20) రామసముద్రం మార్గంలోని ఐస్ ఫ్యాక్టరీలో పనిచేసేవాడు. ఆదివారం పుట్టిన రోజు ఘనంగా జరుపుకోవాలని తన స్నేహితులకు చెప్పాడు. శనివారం అర్ధరాత్రి వరకు వారితో గడిపి ద్విచక్రవాహనంలో ఎన్టీఆర్ సర్కిల్‌లో ఇంటికి వెళుతుండగా ఓ లారీని ఢీకొనడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేసి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా పుట్టినరోజు నాడే చనిపోవడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. ఆ ప్రాంతంలో విషాదం నెలకొంది.

యువతి ఆత్మహత్య



మృతిచెందిన కన్మణి

గంగవరం, సెప్టంబరు 1: తండ్రి అసహనాన్ని భరించలేక క్షణికావేశంలో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన పలమనేరు మండలంలోని టి.వడ్డూరు గ్రామంలో ఆదివారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. టి.వడ్డూరు గ్రామానికి చెందిన లోకేష్ కుమార్తె కన్మణి (18) రెండేళ్లుగా ఆరోగ్య సమస్యలతో సతమతమవుతోంది. ఆమె తల్లికి కూడా మూడు రోజులుగా ఆరోగ్యం సరిగాలేదు. ఈ క్రమంలో వైద్యం విషయమై లోకేష్ అసహనంతో మాట్లాడటాన్ని విన్న కన్మణి.. ఓ గదిలోకి వెళ్లి ఉరేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను కాపాడి వెంటనే పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టపగలే దుకాణంలో చోరీ



సీసీ కెమెరాలోరికార్డయిన దుండగులు

పెద్దపంజాణి, సెప్టంబరు 1: పెద్దపంజాణిలో జాతీయ రహదారి పక్కన ఉన్న దుకాణంలో చోరీ జరిగింది. మండల కేంద్రంలో బెరపల్లె గ్రామానికి చెందిన క్రిష్ణారెడ్డి శ్రీసాయిట్రేడర్స్ పేరుతో హోల్‌సేల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆది వారం తన కుమార్తెను దుకాణంలో ఉంచి పనిపై బయటకు వెళ్లాడు. ఆ సమయంలో ద్విచక్ర వాహనంలో ఇద్దరు వ్యక్తులు వచ్చి పేపర్ ప్లేట్స్ కావాలని అడిగారు. దుకాణంలో ఉన్న అమ్మాయి ర్యాక్‌లో ఉన్న ప్లేట్స్ తీసుకొస్తుండగా డ్రా ఓపెన్ చేసి అందులో ఉన్న రూ.30వేలు చోరీ చేసి పారిపోయారు. అమ్మాయి గట్టిగా కేకలువేసింది. అప్పటికే వారు పరారయ్యారు. క్రిష్ణారెడ్డి సమాచారం అందు కుని పక్క దుకాణం వద్ద సీసీ కెమెరాలు పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

గంజాయి మత్తులో వాహన యజమానిపై హత్యాయత్నం

దుండగుల కోసం గాలింపు చర్యలు



చికిత్స పొందుతున్న రమేష్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 1: గంజాయి మత్తులో వాహన యజమానిపై గుర్తు తెలియని దుండగులు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం అర్ధరాత్రి ఎంఆర్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి.. వెదురుకుప్పం మండలం చిన్నగారిపల్లికి చెందిన రమేష్ టాటా ఏస్ వాహనంలో లగేజీ తోలుతూ జీవనం గడుపుతున్నాడు. ఈక్రమంలో శనివారం తన వాహనంలో బ్యాటరీలు తీసుకెళ్లి నాయుడుపేట-శ్రీకాళహస్తి మార్గంలోని ఒక బ్యాటరీ కంపెనీలో అన్‌లోడ్‌చేసి వచ్చాడు. శనివారం అర్ధరాత్రి దాదాపు 1.30 నుంచి 2 గంటల ప్రాంతంలో తనపల్లి క్రాస్‌లోని గ్రీన్ ల్యాండ్ కేఫ్ వద్ద వాహనం ఆపి టీ తాగుతుండగా గుర్తు తెలియని దుండగులు ఇద్దరు అతడి వద్దకు వచ్చారు. అప్పటికే గంజాయి సేవించి వున్న వారు మత్తులో అతడి వద్దకెళ్లి వాహనం ఇక్కడ ఎందుకు ఆపి టీ తాగుతున్నావు అంటూ ఒక్కసారిగా దాడికిదిగారు. రమేష్ వారిని అడ్డుకోగా, దుండగుల్లో ఒకరు తన వద్ద వున్న కత్తితో అతడిపై దాడి చేశాడు. మరో దుండగుడు చేతులు, కాళ్లపై కొట్టడంతో అతడు స్పృహ తప్పి పడిపోయాడు. విషయం గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రమేష్ మణికట్టు, ఎడమ వైపు కడుపుపై బలమైన గాయాలయ్యాయి. పోలీసులు చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. డీఎస్పీ నరసింగప్ప ఆదేశాల మేరకు పోలీసులు దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. హైవేపై వున్న సీసీ పుటేజీల ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు ఎంఆర్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో గత 10 రోజుల వ్యవధిలో మూడు చోట్ల చోటు చేసుకున్నా పోలీసులు గంజాయి బ్యాచ్‌ను గుర్తించి అరెస్టు చేయడంలో విఫలమవుతున్నారు. పోలీసుల నిర్లక్ష్యంపై స్థానిక ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

స్విమ్స్‌లో బీఎస్సీ, బీపీటీ కోర్సులకు రేపు, ఎల్లుండి 2వ వెబ్ కౌన్సెలింగ్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 1: స్విమ్స్ యూనివర్శిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఎస్సీ(నర్సింగ్), బీపీటీ, బీఎస్సీ(పారామెడికల్) కోర్సుల ప్రవేశానికి మంగళ, బుధవారాల్లో 2వ వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్ బిట్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు స్విమ్స్ వెబ్‌సైట్‌లో లింకు ద్వారా కోర్సులను ఎంపిక చేసుకోవాలని పేర్కొన్నారు. ఎస్ఎంఎస్, ఈ-మెయిల్ ద్వారా విద్యార్థులకు సమాచారం వస్తుందని తెలిపారు.వివరాలకు స్విమ్స్‌వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆమె సూచించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.53 కోట్లు

తిరుమల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామికి హుండీ ద్వారా రూ.4.53 కోట్లు సమకూరింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి, ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 81,207 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 31,414 మంది తలనీలాలు సమర్పించారు.

టీటీడీ సీఈ బాధ్యతల స్వీకరణ



సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాగేశ్వరరావు

తిరుమల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చీఫ్ ఇంజనీర్(సీఈ)గా టీవీ సత్యనారాయణ శనివారం బాధ్యతలు చేపట్టారు. సీనియార్టీ ఉన్నప్పటికీ తనకు చీఫ్ ఇంజనీర్‌గా ప్రదోన్నతి కల్పించలేదని, తనకన్నా జూనియర్‌గా ఉన్న నాగేశ్వరరావుకు పదోన్నతి కల్పించారంటూ ఎస్ఈ సత్యనారాయణ కొన్నేళ్లుగా కోర్టు ద్వారా పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. కోర్టు కూడా స్పందిస్తూ సర్వీస్ రూల్స్‌కు అనుగుణంగా పదోన్నతి కల్పించాలని, సీఈ పోస్టుకు సత్యనారాయణ అర్హుడని స్పష్టం చేసింది. డీపీసీ(డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ) నియమ నిబంధనలు పాటిస్తూ సత్యనారాయణను 2020 నుంచే సీఈగా పరిగణించాలని జూలై నెలలో తీర్పు వెలువడిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ప్రభుత్వం మారిన తర్వాత జరిగిన బదిలీల్లో ఆయన ఎస్ఈ-2 కింద తిరుపతినుంచి తిరుమలకు వచ్చారు. ప్రస్తుతం సీఈగా ఉన్న నాగేశ్వరరావు పదవీ విరమణ చేయడంతో సీనియార్టీ ప్రకారం సత్యనారాయణను సీఈగా టీటీడీ నియమించింది. దీంతో ఆయన శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు.

వంటనూనె తెచ్చిన తంటా

భార్యాభర్తల మధ్య గొడవ ● గుళికల మందు తాగి భర్త ఆత్మహత్య

బంగారుపాళ్యం, సెప్టెంబరు 1: వంటనూనె కారణంగా ఆ భార్యాభర్తలు గొడవపడ్డారు. మనస్తాపానికి గురైన భర్త గుళికల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని రాగిమానుపెంట వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు... కీరమంద గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం అలియాస్ సుబ్బయ్య (55) రాగిమానుపెంట వద్ద ఓ మామిడి తోటలో కాపలాదారుడిగా ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం భార్యతో కలిసి బంగారుపాళ్యం సంతకు వచ్చాడు. సరుకులు తీసుకుని తిరిగి వెళుతుండగా మార్గమధ్యంలో వంటనూనె జారి కింద పడిపోవడంతో ఇద్దరి మధ్య గొడవ వచ్చింది. జీవితంపై విరక్తి చెందిన సుబ్బయ్య ఇంటికి వచ్చిన తర్వాత వరి పంటకు వేసే గుళికల మందు తాగేశాడు. బంధుమిత్రులు గమనించి బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బస్సులో సీటు కోసం బ్లేడ్‌తో దాడి



దాడిలో గాయపడ్డ ఆదినారాయణ

చౌడేపల్లె, సెప్టెంబరు 1: బస్సులో సీటు కోసం జరిగిన ఘర్షణలో ఓ యువకుడు ఒక వృద్ధుడిపై బ్లేడ్‌తో దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటన చౌడేపల్లెలో ఆదివారం జరిగింది. బాధితుడి కథనం మేరకు.. రామసముద్రం మండలానికి చెందిన ఆదినారాయణ చౌడేపల్లె మండలం కొత్తపల్లెలోని తన కూతురు చిత్ర ఇంటికి వచ్చాడు. కూతురును సొంత ఊరికి తీసుకెళ్లడానికి చౌడేపల్లె బస్టాండుకు వచ్చాడు. ఈ క్రమంలో తిరుపతి నుంచి పుంగనూరు వస్తున్న ఓ ఆర్టీసీ బస్సులో సూరయ్యగారిపల్లెకు చెందిన రాజేష్ పుంగనూరుకు వస్తున్నాడు. చౌడేపల్లెలోకి వచ్చిన బస్సును ఆదినారాయణ, తన కుమార్తెతో కలిసి ఎక్కాడు. సీటు పట్టుకున్నాడు. రాజేష్ కూడా అదే సీటు కోసం వారితో ఘర్షణపడ్డాడు. ఇరువర్గాల ఘర్షణతో బస్సులో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని కండెక్టర్ వారిని దించేశాడు. బస్సు దిగిన రాజేష్ రోడ్డుపై ఉన్న బ్లేడ్ తీసుకుని ఆదినారాయణపై దాడి చేసి పారిపోవడానికి ప్రయత్నించాడు. స్థానికులు అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈదాడిలో ఆదినారాయణ చేతికి గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. హెడ్ కానిస్టేబుల్ బాలసుబ్రహ్మణ్యం కేసు నమోదు చేశారు.


పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు 1: విజయవాడ నగర ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదల కారణంగా రైలు మార్గాలపై వర్షపు నీరు ప్రవహించడంతో తిరుపతినుంచి సికింద్రాబాదు వెళ్లే ప్రత్యేక రైలు, ఆదిలాబాదు నుంచి తిరుపతికి వచ్చే కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లను ఆదివారం రద్దు చేశారు. త్రివేండ్రం నుంచి న్యూఢిల్లీకి వెళ్లే కేరళ ఎక్స్‌ప్రెస్‌ను కడప మార్గంలో దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. విజయవాడ - గూడూరు మీదుగా చెన్నైకి వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లు, ప్యాసింజర్లను అధికసంఖ్యలో రద్దు చేసినట్లు పేర్కొన్నారు. సోమవారం తిరుపతి-విజయవాడ మధ్య నడిచే పలు రైళ్లను కూడా రద్దు చేసే అవకాశం ఉందన్నారు.

స్విమ్స్‌లో సీసీ కెమెరాలకు చిక్కిన రోగి

ఒంటరిగానే నడిచి వెళుతున్నట్లు గుర్తించిన పోలీసులు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 1: స్విమ్స్‌లో ఐదు రోజుల కిందట కనిపించకుండా పోయిన టి.సీతారామప్ప అదే రోజు వార్డు నుంచి ఒంటరిగా బయటకు వెళ్లిపోయినట్లు తేలింది. స్విమ్స్‌లోని ఓ సీసీ కెమెరాలో దీనికి సంబంధించిన పుటేజీని పోలీసులు, స్విమ్స్ సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు. వైద్యం కోసం స్విమ్స్‌కు వచ్చి గత నెల 27వ తేదీన స్విమ్స్‌లోని ఏంఐసీయూ వార్డులో అడ్మిట్ అయిన రోగి టి.సీతారామప్ప అదే రోజు అర్ధరాత్రి నుంచి కనిపించకుండా పోయిన విషయం తెలిసిందే. అప్పటినుంచి పోలీసులు, స్విమ్స్ సెక్యూరిటీ రోగి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నా ఆచూకీ తెలియరాలేదు. మరోవైపు రోగి ఆచూకీ కోసం తిరుపతి వెస్ట్ సీఐ రామకృష్ణ రెండు ప్రత్యేక బృందాలనూ ఏర్పాటు చేశారు. ఆదివారం డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి స్విమ్స్ ఆవరణలో వెతికించారు. సీతారామప్ప చికిత్స పొందుతున్న వార్డు నుంచి భవనం వెనుక ఎస్వీ యూనివర్సిటీ వైపు వరకు జాగిలం వచ్చి అక్కడినుంచి వెనుదిరిగింది. అనంతరం శ్రీపద్మావతి భవనంలో ఉన్న సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించగా.. సీతారామప్ప అడ్మిట్ అయిన ఆగస్టు 27వ తేదీ అర్ధరాత్రి తర్వాత 3.15 గంటల సమయంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో భవనం వెనుక మార్గంలో నడుచుకుంటూ వెళుతున్నట్లు గుర్తించారు. వెంటనే సీతారామప్ప కుమారుడు విశ్వనాథ్‌ను పిలిపించి ఆ సీసీ పుటేజీలను చూపించగా తన తండ్రే అని గుర్తించాడు. అయితే గ్రౌండ్‌ఫ్లోర్‌లో నడుచుకుంటూ వెళుతున్న పుటేజీ మాత్రమే కనిపించడంతో ఆ భవనం వెనుకనుంచి ఎస్వీ యూనివర్సిటీ ఆవరణలోకి వెళ్లి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఐదు రోజులుగా చిన్నపాటి ఆధారం కూడా లభించకపోవడంతో రోగి బంధువులు కూడా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇపుడీ సీసీ పుటేజీని చూసినవారు కొంత ఊపిరి పీల్చుకున్నారు. ఎక్కడికి వెళ్లి ఉంటాడన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. కాగా, రోగిని ఎవరూ ఏమీ చేయలేదని ఆయనే వార్డు నుంచి బయటకు వెళ్లాడని, ఇందులో స్విమ్స్ యాజమాన్యం తప్పిదం లేదని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



సీతారామప్ప ఒంటరిగా నడుచుకుంటూ వెళుతున్న సీసీ కెమెరా పుటేజీ



మామండూరు వద్ద లారీ బోల్తా

చంద్రగిరి, సెప్టెంబరు 1: చంద్రగిరి మండలం, మామండూరు వద్ద ఆదివారం తెల్లవారు జామున లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో లారీ డ్రైవర్ మధుకు స్వల్ప గాయాలయ్యాయి. కర్నాటక రాష్ట్రం, ముల్బాగల్ నుంచి ఇంటీరియల్ మెటీరియల్ లోడ్డుతో తిరుపతికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. చంద్రగిరి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. లారీ డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే అదుపు తప్పి బోల్తా పడిందని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఎస్వీయూ 70వ ఆవిర్భావ దినోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 1: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ 70వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించుకోనున్నారు. ఉదయం 10 గంటలకు యూనివర్సిటీ ప్రాంగణంలోని మహనీయుల విగ్రహాలకు పుష్పాంజలి ఘటించి నివాళి అర్పిస్తారు. సాయంత్రం 5 గంటలకు ఆవిర్భావ దినోత్సవ సభ నిర్వహిస్తారు. ఇందులో ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు తదితరులు పాల్గొంటారు. విద్యార్థులు, ఉద్యోగులకు నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు చేపడతారు.





భాకరాపేట ఘాట్‌లో బోల్తాపడిన లారీ - లారీని ఢీ కొన్న స్కూటర్

భాకరాపేట ఘాట్‌లో కర్రల లారీ బోల్తా

ప్రమాదానికి గురైన లారీని ఢీ కొన్న స్కూటర్ ● ముగ్గురికి గాయాలు

చంద్రగిరి, సెప్టెంబరు 1: తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం భాకరాపేట ఘాట్‌రోడ్డులో కర్రల లోడ్డుతో వస్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. అదే సమయంలో ఈ లారీని భాకరాపేట నుంచి తిరుపతి వైపు వస్తున్న స్కూటర్ ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. అన్నమయ్య జిల్లా రాయచోటి నుంచి భద్రాచలానికి కర్రల లోడ్డుతో లారీ బయలుదేరింది. భాకరాపేట ఘాట్ రోడ్డులోకి రాగానే మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఇంతలోనే చంద్రగిరికి చెందిన బాలాజీ, ఆయన భార్య స్వాతి, వదిన మీనా స్కూటర్‌పై వస్తుండగా బోల్తా పడిన లారీని ఢీ కొన్నారు. ఈప్రమాదంలో స్కూటర్‌పై వస్తున్న బాలాజీ, స్వాతి, మీనాకు గాయాలయ్యాయి. లారీ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. సమాచారం చంద్రగిరి ఎస్ఐ రవీంద్ర నాయక్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ధ్వంసమైన ఏటీఎం (ఫైల్ ఫొటో)

ఏటీఎంలో చోరీ ఇంటి దొంగల పనే..!

● పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులున్నట్లు సమాచారం

చంద్రగిరి, సెప్టెంబరు 1: చంద్రగిరి పట్టణం కొత్తపేటలోని కోసూరి కాంప్లెక్స్‌లో ఉన్న ఎస్బీఐ ఏటీఎంలో గురువారం రాత్రి జరిగిన చోరీ ఇంటి దొంగల పనే అని పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. సీసీ పుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించినట్లు సమాచారం. ప్రస్తుతం పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులున్నట్లు సమాచారం. విశ్వసనీయ కథనం మేరకు.. ఎస్బీఐ ఏటీఎంలలో నగదు పెట్టే ప్రైవేటు సిబ్బంది అయిన కస్టోడియన్ సురేష్ పథకం ప్రకారం ఈనెల 27వ తేదీన కోసూరి కాంప్లెక్స్‌లోని ఏటీఎం మెషీన్‌లో నగదు పెట్టి.. దానికి సంబంధించిన తాళం వేయకుండా, ప్రధాన డోరుకు సంబంధించిన తాళం వేసి వచ్చేశాడు. అదే రోజు రాత్రి నగదు తరలించే వాహన డ్రైవర్ మనోజ్‌కు విషయాన్ని తెలిపాడు. అతను తన స్నేహితుడు మనోజ్‌కు విషయం తెలిపి.. నగదు చోరీకి ప్రణాళిక రూపొందించారు. డ్రైవర్ స్నేహితుడైన మనోజ్ సెక్యూరిటీ వేషధారణలో వచ్చి సురేష్ వద్ద ఉన్న ప్రధాన డోరు తాళంతో ఏటీఎం తెరిచి లోపలున్న నగదును చోరీ చేశాడు. అనంతరం ఇది ఇంటి దొంగల పనే అన్న అనుమానం రాకుండా ఉండటానికి గడ్డపారతో ఏటీఎంను కదిలించి, ధ్వంసం చేశాడు. కాగా, వీరు చంద్రగిరిలోనే కాకుండా తిరుపతిలోని గిరిపురం, అన్నారావు సర్కిల్, తుమ్మలగుంట దగ్గర ఉన్న ఎల్ఎస్‌నగర్‌లోని ఏటీఎంలలో కూడా ఈ తరహాలోనే చోరీ చేసినట్లు గుర్తించారు. ఏటీఎం చోరీ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేసి, మరో రెండ్రోజుల్లో నిందితులను అరెస్టు చూపి, రిమాండ్‌కు తరలించనున్నట్లు సమాచారం.

విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటు ఎప్పుడో..?

● ఎన్నికల సమయంలో భూమిపూజలకే పరిమితం చేసిన గత వైసీపీ ప్రభుత్వం ●ఆరు గ్రామాలలో ఒక్క ఇటుక పెట్టని వైనం● రూ.10.80 కోట్ల నిధులు ఎటువెళ్లాయో తెలియదంటున్న జనం

బి.కొత్తకోట, సెప్టెంబరు1: గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల సమయంలో విద్యుత్ సబ్‌స్టేషన్లు గురించి పట్టించుకోకుండా ఎన్నికల సమయంలో హడావిడిచేసి చివరికి చేతులెత్తేసిన వైనం తంబళ్లపల్లె నియోజకర్గంలో చోటుచేసుకుంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నియోజకవర్గంలో ఆరు 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను మంజూరు చేయించగా అందులో బి.కొత్తకోట మండలంలోని గట్టుపంచాయతీ కొత్తపల్లె, నగర పంచాయతీ పరిధిలోని శెట్టిపల్లి, పీటీయం మండలంలోని పులికల్లుపంచాయతీ బొంతలవారిపల్లి, టీ.సదుం పంచాయతీ రామాపురం, ములకలచెరువు మండలంలోని మద్దినాయునిపల్లె, పాతకోట గ్రామాలలో 2024 మార్చి18న ఒకేరోజు ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ట్రాన్స్‌కో సిబ్బంది, మండల అధికారులతోపాటు సొంత మంది మార్బలాన్ని వెంటబెట్టుకుని అట్టహాసంగా శంకుస్థాపనలు చేశారు. అన్నింటికీ శిలాఫలకాలు వేశారు. ఇక లోవోల్టేజీ సమస్య ఉండదని ఈ సందర్భంగా రైతులకు హామీఇచ్చారు. దీంతో ఆయా గ్రామాల పరిధిలోని రైతులు ఆనందించారు. ఇకపై తమకు లోఓల్టేజి సమస్య ఉండదని మోటార్లు బాగా నడుస్తాయని భావించారు. అయితే అది కార్యరూపం దాల్చలేదు. వారి ఆశలు అడియాశలయ్యాయి.



బి. కొత్తకోట శెట్టిపల్లె వద్ద ఎమ్మెల్యే వేసిన శిలాఫలకం

రూ.10.80 కోట్ల నిధులు ఎటువెళ్లాయో తెలియదు

తంబళ్లపల్లె నియోజకవర్గానికి మంజూరైన ఆరు విద్యుత్ సబ్‌స్టేషన్ లలో ఒక్కో సబ్‌స్టేషన్‌కు రూ.1.83కోట్లు చొప్పున మొత్తం సుమారు రూ.10.80 నిధులు సైతం మంజూరయ్యాయి. నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ సైతం పూర్తి అయింది. నిర్మాణ పనులను కేయస్ఆర్ ఏజెన్సీస్ అనే కంపెనీ దక్కించుకుంది. ఆరు చోట్ల సబ్‌స్టేషన్‌ల నిర్మాణాలకు అవసరమయ్యే స్థలాన్ని రెవెన్యూ అధికారులు కేటాయించారు. అయినా అప్పట్లో ఏం జరిగిందో ఏమో... నిర్మాణాలు ప్రారంభించ లేదు. అదిగో..ఇదిగో అంటూండగానే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. దీంతో మంజూరైన నిధులు ఏమయ్యాయో ఎవరికి తెలియదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పుడు ప్రభుత్వం మారింది. కథ మళ్లీ మొదటికొచ్చింది. ఈ ప్రభుత్వంలో మళ్లీ ప్రతిపాదనలు, ప్రభుత్వ అనుమతి, నిధుల విడుదల అన్నీ జరగాల్సి వుంది. ఎన్నికల స్టంట్ చేయకుండా వైసీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేసి ఉంటే సబ్‌స్టేషన్‌లు పూర్తి అయి రైతులకు మేలు చేకూరేది.

నిర్మాణాలే జరిగి ఉంటే...

నియోజకవర్గంలో విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణాలు జరిగిఉంటే వ్యవసాయానికి లోఓల్టేజీ సమస్యలేకుండా పోయేది. ముఖ్యంగా మూడు మండలాల్లో లోఓల్టేజీ సమస్య ఉందని రైతులు పలుమార్లు అధికారులకు విన్నవించడం తోపాటు. పరిస్థితిని నేరుగా గమనించిన ట్రాన్స్‌కో అధికారులు సబ్‌స్టేషన్‌ల నిర్మాణం జరగాల్సిన ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలు పంపారు. పాలకులు పదవీకాలం అంతా పట్టించుకోకుండా తీరా చివరి నిమిషంలో హడావిడిగా శంకుస్థాపనలతో చేతులు దులుపుకొని నిర్మాణాలపై శ్రద్ధ చూపకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని రైతులు వాపోతున్నారు. నిర్మాణాలే జరిగి వుంటే ఆరు సబ్‌స్టేషన్‌ల పరిధిలో సుమారు 40 గ్రామాల రైతులకు లాభం చేకూరేదంటున్నారు.

మళ్ళీ నిధులు రావాల్సిందే..

నియోజకవర్గ పరిధిలోని ఆరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల నిర్మాణాల కోసం వచ్చిన ఆ నిధులు తరలిపోయాయి. ఇప్పుడు మళ్లీ అనుమతులు వచ్చి, నిధులు విడుదలైతే పనులు జరుగుతాయి. నూతన ప్రభుత్వం వచ్చింది కాబట్టి. మళ్లీ ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపాల్సి ఉంటుంది. తాను కొత్తగా వచ్చాను కాబట్టి పూర్తి వివరాలు తెలియవు

-గంగాధర్, డీఈ ట్రాన్స్‌కో

ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహిద్దాం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు1:మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లె రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పిలుపునిచ్చారు. ఆదివారం తన స్వగృహంలో నియోజకవర్గంలోని రామసముద్రం, నిమ్మనపల్లె, మదనపల్లె ఎంఈవోలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు నవసమాజ నిర్మాతలని వారిని గౌరవించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గొప్పగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించినట్లు గుర్తు చేశారు. ఈ నెల 5న స్థానిక బుగ్గవంక సమీపంలోని ఎస్వీఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించే ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా జరగాల్సిన కార్యక్రమాలు, ఏర్పాట్లపై ఆయన ఎంఈవోలతో చర్చించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిభ కలిగిన ఉపాధ్యాయులను అవార్డులతో సత్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను మండల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ప్రభాకర్‌రెడ్డి, పద్మాతమ్మ, హేమలత, ఆంజనేయులు, కార్యక్రమ సమన్వయ కర్త పఠాన్ మహ్మద్ ఖాన్, ఉపాధాయ సంఘం నాయకులు మధు, సుధాకర్ నాయుడు, హేమలత, మురళి, రమాదేవి, శంకర, చంద్రశేఖర్, అశోక్, లక్ష్మీపతి, గాలి రవీంద్ర, అయూబ్‌ఖాన్, తదిరతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

తొగట కులస్థుల్లో రాజకీయ చైతన్యం రావాలి

● కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు1: తొగట కులస్థులు ఐకమత్యంతో మెలిగి రాజకీయ చైతన్యం రావాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక రింగ్‌రోడ్డు చౌడేశ్వరీ కళ్యాణ మండపంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొగటవీరక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు పురాణం చంద్రశేఖర్, కార్యదర్శి పవన్‌కుమార్, ఉపాధ్యక్షుడు రామిశెట్టి రత్నమయ్య, సభ్యులు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు, టీడీపీ సీనియర్ నాయకుడు మోడెం సిద్దప్ప కలిసి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌ను పూలమాలతో, దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తొగట కులస్థులను అన్ని విధాల అభివృద్ధి దిశగా నడిపిస్తానని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజా అభివృద్ధికి తోడ్పడతారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు రామిశెట్టి నీలకంఠ, రామిశెట్టి చంద్రయ్య, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయకమి అధ్యక్షుడు పురాణం వెంకటరత్నం, నాగరాజ, లక్ష్మీనారాయణ, వెంకటేష్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

'సంజీవని' శిబిరానికి విశేష స్పందన

పీలేరు, సెప్టెంబరు 1: కేవీపల్లె మండలం వగళ్ల గ్రామంలో ఆదివారం జరిగిన సంజీవని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ వారి ఆర్థిక సాయంతో జరిగిన ఈ ఉచిత వైద్య, అవగాహన శిబిరంలో వగళ్ల పంచాయతీలోని పలు గ్రామాలకు చెందిన 221 మంది మహిళలు పాల్గొన్నారు. వారందరికీ వైద్యులు ఉచిత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అంతే కాకుండా 95 మంది మహిళలకు ఉచిత పాప్ స్మియర్ టెస్టులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్టులు డాక్టర్ సృజన, డాక్టర్ కీర్తన, జనరల్ మెడిసిన్ వైద్యులు డాక్టర్ జిలానీ, డాక్టర్ షమీమ్, శ్రీనివాస ట్రస్టు ట్రస్టీ డాక్టర్ పీవీ బ్రహ్మరెడ్డి, సభ్యులు శ్రీనివాస రెడ్డి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శశికుమార్ రెడ్డి, వలంటీర్లు రామాంజనేయులు, షబ్బీర్, బాషా, సునీల్, తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరంలో మహిళలను పరీక్షిస్తున్న గైనకాలజిస్టులు

మిట్స్ విద్యార్థులకు కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ సర్టిఫికెట్లు

కురబలకోట, సెప్టెంబరు 1: అత్యంత ప్రతిష్టాత్మకమైన కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ సర్టిఫికెట్లను ఏడుగురు మిట్స్ విద్యార్థులు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తెలిపారు. మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉదయ్‌శంకర్‌రెడ్డి, గంగిరెడ్డి, శివాని, సత్యప్రియ, కార్తీక్‌సాయి, కృష్ణసాయి, మహేష్ ఒంకార్‌లు విద్యా సామర్థ్యాల పెంపునకు సంబంధించి బి-2 లెవల్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ళ, ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తదితరులు అభినందించారు.



ప్రతిభ కనబరిచిన మిట్స్ విద్యార్థులు

రాజ్యాంగ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 1: రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణకే ప్రతి ఒక్కరూ పాటుపడాలని ప్రజాసేవ సంస్థ అధ్యక్షుడు సహదేవ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ కళాశాల వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ పరంగా కల్పించిన అన్ని హక్కులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కొందరు సభ్యులు మాట్లాడుతూ స్థానిక పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల్లో కూడా తమకు న్యాయం జరగలేదని తెలుపగా వాటిని పరిష్కరించు కొనేందుకు ఈనెల 8న మండల కమిటీలు వేయనున్నట్లు తెలిపారు. అలాగే జిల్లా, రాష్ట కమిటీలు వేసి అన్ని కులాలను ఏకం చేసి ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముబారక్, వెంకటరమణ, యర్రయ్య, శ్రీరాములు, నవీన్, సుధాకర్, రాజన్న, చలపతి, రమణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో జనసేన కార్యకర్త మృతి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 1: బెంగళూరు నుంచి వస్తూ మదనపల్లి చిప్పిలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జనసేన కార్యకర్త గుమ్మడి శివ(30) మృతి చెందాడు. ఆదివారం కుటుం బీకులు మాట్లాడుతూ మండలంలోని తవళం పంచాయతి చౌకిళ్లవారిపల్లికి చెందిన గుమ్మడి శివ బెంగళూరులో క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తు న్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉప ముఖ్య మంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని బెంగళూరు నుంచి శనివారం రాత్రి తన ధ్విచక్రవాహనంలో వస్తుండగా మదనపల్లి చిప్పిలి వద్ద లారీ ఢీ కొని మృతి చెందాడు. అయితే శివ జనసేన పార్టీలో ముఖ్య నేతగా ఉంటూ జనసేన పార్టీ సభ్యత్వ నమోదు చేసుకొన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా విషయం తెలుసుకున్న జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ప్రదీప్ శివ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబీకులకు ధైర్యం చెప్పి పార్టీ తరపున ఆదుకొంటామని తెలిపారు. శివకు బార్య జ్యోతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శివ మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకొన్నాయి.



శివ (ఫైల్ ఫోటో)

మరో ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

ములకలచెరువు, సెప్టెంబరు 1: రోడ్డు ప్రమాదంలో శివకుమార్(26)అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డ సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు...బి.కొత్తకోట మండల గోళ్లపల్లెకు చెందిన శివకుమార్ పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో ములకలచెరువుకు బయలుదేరి వెళుతుండగా మార్గ మధ్యంలోని వేపూరికోట వద్ద బొలెరో పికెప్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో మదనపపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు.

వీధి కుక్కల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

రామసముద్రం, సెప్టెంబరు 1: మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ప్రజలు ఇంటి నుండి బయటకి రావాలంటే బయపడుతున్నారు. మనుషులపైనే కాకుండా గొర్రెలు, మేకలు, కోళ్లపై కూడా కుక్కల దాడి చేసి ప్రాణాలు తీస్తున్నాయి. పెద్దకుర ప్పల్లె పంచాయతీ తిరుమలరెడ్డిపల్లెలో వీధి కుక్కల దాడిలో రామప్ప(65)పై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. రామప్ప మాట్లాడుతూ మా గ్రామంలో వీధి కుక్కలు ఎక్కువయ్యాయని వాటివల్ల పిల్లలు కూడా భయాందోళన చెందుతున్నట్లు ఆయన తెలిపారు. అధికారులు స్పందించి వీధి కుక్కల భారీ నుండి కాపాడాలని ఆయన కోరారు.

విగ్రహ ప్రతిష్ఠను అడ్డుకున్న పోలీసులు

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 1 : మండలంలోని మద్దయ్యగారిపల్లె లోని ఓ ప్రభుత్వ స్థలంలో చేపట్ట తలచిన ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆదివారం అనుమతులేవంటూ పోలీసులు అడ్డుకున్నారు. విగ్రహ ప్రతిష్ఠకు పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులు వస్తారని నిర్వాహకులు మద్దయ్యగారిపల్లెలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే ఉన్నతాధికారుల ఆదేశానుసారం గ్రామంలో 144 సెక్షన్ అమలులో ఉందని ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వాహకుడైన మద్దయ్యగారిపల్లె హరిని అదుపులోకి తీసుకుని పీటీఎం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం పీటీఎం పోలీసులు అక్కడికి చేరుకుని అక్కడ ఉన్న షామియానాలను తొలగించారు. పూజారులను, భజంత్రీలను సైతం పోలీసులు అనుమతించలేదు. పెద్ద ఎత్తున గ్రామస్తులు అక్కడికి చేరుకుని గ్రామంలో పూజా కార్యక్రమాలను, విగ్రహ ప్రతిష్ఠలను ఎలా అడ్డుకుంటారని వాదించారు. ఇక్కడ ఉన్న ప్రభుత్వ భూమిలో విగ్రహ ఏర్పాట్లు చేసుకునేందుకు అనుమతులు తీసుకోకుండా ఎలా పడితే అలా చేయడం చట్టరీత్యా నేరమని ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అనుమతులు తీసుకున్న తరువాత విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవాలని అధికారులు తెల్పి చెప్పడం, నిర్వాహకులను పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో సమస్య సర్దుమణిగింది. నిర్వాహకులను స్టేషన్‌కు తీసుకెళ్లి వారితో చర్చించి ఆతరువాత వారిని విడిచి పెట్టారు. రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లి అనుమతులను తీసుకున్న తరువాత విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవాలని అధికారులు తెల్పి చేప్పారు.



మద్దయ్యగారిపల్లె గ్రామంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయ తలపెట్టిన చోట పోలీసు బందోబస్తు

సీఎం చంద్రబాబును కలిసిన తంబళ్లపల్లె నేతలు

పెద్దమండ్యం, సెప్టెంబరు1: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును తంబళ్లపల్లె టీడీపీ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి మనోహర్ నాయక్ ఆదివారం అమరావతి లోని సీఎం క్యాంప్ కార్యాలయంలో కలసి గిరిజన ప్రత్యేక గ్రామ పంచాయతీలకు అభివృద్ధి కి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు విడుదల చేయాలని కోరారు. తంబళ్లపల్లె సమస్యలు, రాజకీయ పరిస్థితులను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. గిరిజన నాయకులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబును కలిసిన మనోహర్‌నాయక్

ఓపీఎస్ విధానమే ఆమోదయోగ్యం

కలికిరి, సెప్టెంబరు 1: ఉపాధ్యాయులకు ఓపీఎస్ విధానం మాత్రమే ఆమోద యోగ్యమని, దీనికి ప్రత్యామ్నాయంగా తెచ్చినవేవీ తమ సమ్మతం కాదని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుమార్ స్పష్టం చేశారు. సెప్టెంబరు 1వ తేదీని సీపీఎస్ విద్రోహ దినంగా పాటిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ మేరకు సంఘం నాయకులతో కలిసి ఆదివారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన ప్రదర్శన చేశారు. సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. అదే విధంగా 117వ జీవోను రద్దు చేసి ప్రతి ప్రాథమిక పాఠశాలలోనూ ఒకటి నుంచి ఐదవ తరగతి వుండే విధంగా పునరుద్ధరించాలని డిమాండు చేశారు. ఉపాధ్యాయులకు అదనపు పని భారం నుంచి విముక్తి కల్పించాలని కోరారు. వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ప్రక్రియ అసంబద్ధంగా వుందని అభ్యంతరం వ్యక్తం చేశారు. తాత్కాలిక సర్దుబాటు కారణంగా పాఠశాలల నిర్వహణ మరింత సమస్యాత్మకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల కొరత దృష్ట్యా డీఎస్సీ నియామకాలు పూర్తయ్యే వరకూ అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించి బోధన కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుమార్, నాయకులు చెంగల్రాయులు, శివప్రసాద్, శంకర, అజంతుల్లా, జాకీర్, సంషుద్దీన్, భాస్కర్, సహదేవ, రెడ్డిగురునాథ తదితరులు పాల్గొన్నారు.



సీపీఎస్ పైన నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

శంకర బ్రాహ్మణ సేవా సహకార సమితికి ఎమ్మెల్యే రూ.లక్ష వితరణ

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు1:శంకర బ్రాహ్మణ సేవా సహకార సమితి భవన నిర్మాణానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా రూ. లక్ష వితరణ ఆదివారం ప్రకటించారు. ఎమ్మెల్యే తోపాటుగా వచ్చిన మాజీ కౌన్సిలర్ నాగార్జునబాబు(గాంధీ) బ్రాహ్మణ సేవా సహకార సమితి భవన నిర్మాణానికి రూ.25 వేలు వితరణ చేశారు. సమితిలో బ్రాహ్మణులతో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సమావేశమై మాట్లాడుతూ బ్రాహ్మణ సేవా సహకార సమితి అభివృద్ధికి పూర్తి సహకారం ఇవ్వనున్నట్లు తెలిపారు. రేకుల షెడ్డును తొలగించి వినాయక స్వామి గుడితోపాటు కాంపౌండ్ ప్రహరీ నిర్మాణం చేపట్టండని చెప్పారు. ఈ కార్యక్రమంలో శంకరబ్రాహ్మణ సేవా సహకార సమితి గౌరవాధ్యక్షుడు కామకోటి ప్రసాదరావు, అధ్యక్షుడు కోదండరామయ్య, గట్టు ప్రకాష్, నరసంహాచార్యులు, కేశవాచార్యులు, రఘునందన, అక్షంతల కుమార్, అడ్వకేట్స్ ఫణీ, సరసా విద్యాసాగర్, శైలజా, చిప్పిలి సత్యనారాయణ ఆలయ అధ్యక్షుడు అమరనాథ్, శివస్వామి, పాల్గొన్నారు.

చెరువును కబ్జా చేశారని ఫిర్యాదు

కలికిరి, సెప్టెంబర్దు 1: మండలంలోని పల్లవోలు పంచాయతీలోని కొత్త చెరువు ఆక్రమణలకు గురైనట్లు తహసీల్దారుకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు పల్లవోలు ఎంపీటీసీ పి.రమణప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు రైతులు తహసీల్దారు మహేశ్వరీ బాయికి వినతి పత్రం అందజేశారు. గడి గ్రామ సమీపంలో కలకడ-కలికిరి రహదారి సమీపంలో సర్వే నెంబరు 458 లోని ఈ చెరువు 14.81 ఎకరాల విస్తీర్ణంలో వుందని దీన్ని కొంత మంది దౌర్జన్యంగా ఆక్రమించి ఇళ్ల స్థలాలుగా కూడా మార్చేశారని పేర్కొన్నారు. వెంటనే ఈ చెరువును సర్వే చేయించి ఆక్రమణల నుంచి విముక్తి కలిగించి ఆయకట్టు రైతులకు న్యాయం చేయాలని ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, సెప్టెంబరు 1:గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం సంతానలక్ష్మి అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో ఉదయాన్నే అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారి పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి సంతానం లేని దంపతులు ఆలయానికి వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి ఆలయానికి రావడంతో పరిసరాలు రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో పనిచేయాలి

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 1: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో పనిచేయాలని మానవ త స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ఎన్.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌జీవో హోమ్‌లో మానవత సంస్థ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానవతా సంస్థ ఏర్పడిన అనతి కాలంలోనే ఎక్కువ మంది సభ్యులు స్వచ్ఛందగా వచ్చి చేరడంతో పాటు, వారికి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా సి.భాస్కర్‌రెడ్డి, కార్యదర్శిగా పి.రమ ణప్ప, సహాయ కార్యదర్శిగా వి.నారదరెడ్డి, కోశాధికారిగా సుధీర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా హరినాథ్‌బాబు, శ్రీనివాసులురెడ్డి, విష్ణుకుమార్‌రెడ్డి, బోర్డు డైరెక్టర్స్‌గా ఆర్.గురుప్రసాద్, బి.నారాయణరెడ్డి, వెంకటేశ్, సుధాకర్‌రెడ్డి, ప్రసాదరావులను ఎన్నుకు న్నారు.

నేరాలకు దూరంగా ఉండాలి : సీఐ



చెర్లోపల్లెలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ ప్రసాద్‌బాబు

గుర్రంకొండ, సెప్టెంబరు 1:ప్రజలు నేరాలకు దూరంగా ఉంటూ ప్రశాంత జీవనం సాగించాలని వాల్మీకీపురం సీఐ ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో ఆదివారం ప్రజలకు నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలన్నారు. అలాగే గ్రామంలో అసాంఘిక కార్యక్రమాలపై ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామంలో సారా అమ్మకాలపై పలుమార్లు ప్రజలు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సారా అమ్మకాలపై సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఇస్తే వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తుల సంచారంపై ప్రజలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మధురామచంద్రుడు, సిబ్బంది, గ్రామప్రజలు పాల్గొన్నారు.

నల్లవీరగంగమ్మ ఆలయంలో చోరీ

పీలేరు, సెప్టెంబరు 1: పీలేరు-తిరుపతి మార్గంలోని రజకుల కాలనీ సమీపంలోని నల్లవీరగంగమ్మ ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. దొంగలు శనివారం రాత్రి ఆలయ ప్రధాన గేటు తాళాలు పగలగొట్టి ఆలయంలోని హుండీని ధ్వంసం చేసి అందులోని నగదు ఎత్తుకెళ్లారు. ఈ విషయం ఆదివారం ఉదయం తెలుసుకున్న ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ బాలకృష్ణ తన సిబ్బందితో ఆలయ పరిసరాలు, ఆలయంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. గత వారం తిరుపతి మార్గంలోని బండ్లవంకలోని గంగమ్మ ఆలయంలో జరిగిన చోరీ విషయం మరిచిపోకముందే మరో ఆలయంలో చోరీతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు.

బెంగళూరుకు వెళ్లి పెన్షన్ అందజేత

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 1 : మండలంలోని బూచిపల్లె పంచాయతీ గొడ్డివారి పల్లెకు చెందిన రాజమ్మ అనే మహిళ అనారోగ్యంతో బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చేరి చికిత్స అందుకుంటుండగా పంచాయతీ కార్యదర్శి సురేష్‌రెడ్డి బెంగళూరుకు వెళ్లి ఆమెకు పెన్షన్ అందించి తన మానవీయతను చాటుకు న్నాడు తన ఉద్యోగ ధర్మాన్ని పాటించి సొంత ఖర్చులతో ఆమెకు పెన్షన్ అందిం చిన పంచాయతీ కార్యదర్శిని అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది అభినందించారు.



నేడు విద్యా సంస్థలకు సెలవు

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 1 : అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు, జూనియర్ కళాశాలలకు సోమవారం సెలవును ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు మండల విద్యాశాఖాధికారి నారాయణ తెలిపారు. భారీ వర్షాలు రావచ్చనే వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు సెలవును ప్రకటించినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 1 :రోడ్డు ప్రమాదంలో పులికల్లు దళితవాడకు చెందిన మిట్టపల్లె ఆంజనేయులు(28) మృతి చెందాడు. కూలి పనుల నిమిత్తం ములకలచెరువులోని టమోటా మండీకి వెళ్లి అక్కడ కూలి పనులను ముగించుకుని తన స్వగ్రామమైన పులికల్లుకు బయలుదేరి వస్తుండగా సమీపంలోని దొంగలమిట్ట వద్ద ఓ కట్టెల ట్రాక్టర్ మరమ్మత్తులకు గురై రోడ్డు పక్కగా ఆగి ఉండడంతో దాన్ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో ద్విచక్రవాహనంలో వస్తున్న ఆంజనేయులు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు, 108 సిబ్బందికి సమాచారం అందించగా హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది అతనిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పీటీఎం ఎస్ఐ నరసింహుడు అక్కడికి చేరుకుని కుటుంబీకులతో మాట్లాడి ఓ ప్రైవేటు అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడు అంజనే యులుకు భార్య కీర్తన, కుమారుడు అన్వేష్ ఉన్నారు. ఽఆంజనేయులు మృతితో పులికల్లు గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.




ఆంజనేయులు (ఫైల్ ఫోటో)

బస్సుల్లేక విద్యార్థుల పాట్లు



బస్సు ఎక్కడానికి విద్యార్థుల పాట్లు



గుర్రంకొండలో బస్సుల కోసం వేచి ఉన్న విద్యార్థులు

గుర్రంకొండ, సెప్టెంబరు 1: గుర్రంకొండ పట్టణం నుంచి మదనపల్లె, అంగళ్లు, వాల్మీకీపురం పట్టణాల్లో పాఠశాలలు, కళాశాల్లో చదివే విద్యార్థిని, విద్యార్థులు సమయానికి సకాలంలో బస్సులు లేక పడరానిపాట్లు పడుతున్నారు. కళాశాలలకు వెళ్లడానికి గుర్రంకొండ బస్టాండులో ఉదయం గంటల తరబడి బస్సుల కోసం నిలబడాల్సిన దయనీయస్థితి నెలకొంది. ఉదయం బస్సుల కొరత అధికంగా ఉండడంతో విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నార బస్సు సర్వీసులను పెంచాలని పలుమార్లు అధికారులక వినవించుకున్న పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు వాపోతున్నారు. గుర్రంకొండ పట్టణం, గ్రామాలోని విద్యార్థిని, విద్యార్థులు ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాలలకు వందలాది మంది మదనపల్లె, వాల్మీకీపురం, అంగళ్లు ప్రాం తాల్లోని వివిధ కాలేజీలకు వెళుతున్నారు. దీంతో ఉదయం 7.30 గంటలకే బస్టాండుకు చేరుకున్నా సకాలంలో బస్సుల్లేక సమయానికి పాఠశాలలు, కళాశాలలకు ప్రతిరోజూ వెళ్లలేకపోతున్నామన్నారు. ఉదయం పూట గంటల తరబడి నిలబడితేకానీ ఆర్టీసీ బస్సులు రావడం లేదు. ఒక వేళ ఒకటి, అర బస్సు వచ్చినా విద్యార్థులు నిలబడడానికి కూడా చోటు దొరకడం లేక ఫుట్‌బోర్డుపై వేలాడుతూ కాలం వెళ్లదీయాల్సి వస్తోందన్నారు. ఇలాంటి పరిస్థితులలో విద్యార్థులు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు ఇబ్బందులు కలుగుకుండా సమయానికి బస్సులు నడపాలని విద్యార్థు తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

బస్సుల కొరత వల్లే సమస్య వస్తోంది

విద్యార్థుల బస్సుల ఇక్కట్ల విషయమై మదనపల్లె ఆర్టీసీ డిపో-1 మేనేజర్ వెంకటరమణారెడ్డి వివరణ కోరగా మదనపల్లె-1, 2 ఆర్టీసీ డిపోలో ప్రస్తుతం బస్సుల కొరత ఉందన్నారు. దీంతో విద్యార్థులకు అనుగుణంగా బస్సులు నడపలేకపోతున్నట్లు తెలిపారు. కొత్త బస్సులు కావాలని జిల్లా అధికారులకు నివేదిక పంపామని కొత్త బస్సులు రాగానే అన్ని మార్గాల్లో బస్సులను నడిపి సమస్యలను పరిష్కారిస్తామన్నారు.